# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY
తెలుగు దినపత్రిక

నల్లగొండ సంపుటి:16 సంచిక:86 ఎడిటర్: సయ్యద్ పాష 12-04-2026 ఆదివారము పేజీలు :8 వెల:1/-



## లంచగొండుల వివరాలు ఎసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

వివరాలకు:

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132,


## హజ్ యాత్రికుల కోసం గ్రాండ్ ఫ్రీ హెల్త్ క్యాంప్

హైదరాబాద్: హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని మినా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత హెల్త్ క్యాంప్‌ను తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీఎంఎఫ్‌సీ) చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ప్రారంభించారు. ఈ హెల్త్ క్యాంప్ కొనసాగుతుంది. ఈ సందర్భంగా యాత్రికులకు జనరల్ హెల్త్ చెకప్‌తో పాటు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మెడికల్ కిట్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి ముందస్తు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ఎంతో అవసరమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీఎంఎఫ్‌సీ) చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ.. కరోనా కాలంలోనూ మినా ఆస్పత్రి విశేష సేవలు అందించిందని, మైనారిటీలకే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్న మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిగా మినా ఆస్పత్రి మంచి పేరు సంపాదించిందన్నారు.

## అభివృద్ధికి మార్పు అవసరం



పూర్బాబర్ధమాన్ : బంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బీజేపీ ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు. పూర్బాబర్ధమాన్ జిల్లా కట్వాలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడిన ఆయన, బీజేపీ అధికారంలోకి వస్తే సిటిజన్‌షిప్ అమెండ్మెంట్ యాక్ట్ కింద పౌరసత్వం ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. మటువా, నమశూద్ర శరణార్థ కుటుంబాలకు భయపడాల్సిన అవసరం లేదని, దేశ రాజ్యాంగం వారి రక్షణకు నిలుస్తుందని మోదీ పేర్కొన్నారు. సీఏఏ చట్టాన్ని అమలు చేయడం ద్వారా శరణార్థులకు పౌరసత్వం కల్పించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. అయితే ఈ అంశంపై తృణమూల్ కాంగ్రెస్ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోందని ఆరోపించారు. ఇక అక్రమ చొరబాటుదారుల అంశంపై కూడా మోదీ తీవ్రంగా స్పందించారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చొరబాటుదారులు బంగాల్ విడిచి వెళ్లాల్సిందేనని హెచ్చరించారు. వారికి సహకరించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్రంలో గత 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ ప్రభుత్వం ప్రజలకు భయమే మిగిల్చిందని మోదీ విమర్శించారు. ఈ ఎన్నికలు తృణమూల్ భయాన్ని తొలగించే దిశగా కీలకమని పేర్కొన్నారు. బంగాల్‌ను అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు మార్పు అవసరమని ప్రజలను కోరారు. ఇదిలా ఉండగా, 294 స్థానాలున్న బెంగాల్ అసెంబ్లీకి ఎన్నికలు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగనుంది.

## గత పదేండ్లలో విప్లవాత్మక పథకాల అమలు



హైద్రాబాద్: వర్ణ వివక్షకు వ్యతిరేకంగా తన జీవితకాలం పోరాడిన భారతదేశ సామాజిక విప్లవకారుడు, సమ సమాజ స్థాపన మార్గదర్శి, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వారు జాతికి చేసిన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. భారత సమాజంలో వర్ణ, కుల లింగ వివక్షతను రూపుమాపి, సామాజిక న్యాయం దక్కాలని పోరాడిన దార్శనికుడు మహాత్మా పూలే అని కొనియాడారు. సబ్బండ వర్ణాలు సామాజిక ఆర్థిక రంగాల్లో ముందడుగు వేయాలంటే విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని చెప్పిన జ్యోతిరావు పూలే ఆశయాలు ఎల్లకాలం ఆచరణీయమైనవని కేసీఆర్ తెలిపారు. తన భార్య సావిత్రి బాయి పూలేకు చదువు నేర్పించి మరీ, చదువు నిరాకరించబడిన భారత మహిళకు విద్య నేర్పాలనే ధృఢ సంకల్పాన్ని అనేక కష్ట నష్టాల నడుమ అమలు చేసిన, మహిళాభ్యుదయ మార్గదర్శి మహాత్మా పూలే అని కొనియాడారు. పూలే ఆశయాలను నిజం చేస్తూ, తన పదేండ్ల ప్రగతి పాలనలో, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ కులాల అభ్యున్నతి కోసం అమలు చేసి ఫలితాలను సాధించిన పలు రకాల పథకాలను కార్యాచరణను కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. సాగునీరు, విద్యుత్, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు అమలు చేసి వ్యవసాయ రంగాన్ని పటిష్టపరిచామని తెలిపారు. పలు వృత్తికులాలను ప్రోత్సహిస్తూ గొర్రెల పెంపకం, చేపల పంపిణీ, నేతన్నకు చేయూత వంటి పథకాలను అమలు చేయడం ద్వారా నూటికి తొంభైశాతంగా ఉన్న దళిత బహుజన కులాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని తెలిపారు. తద్వారా, తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనం జరిగిందని అన్నారు. ఆసరా ఫించన్లు, బీసీ బంధు వంటి బహుజన సంక్షేమ పథకాల అమలు ద్వారా, వెనకబడి ఉన్న సబ్బండ కులాలను ఆర్థికంగా అభివృద్ధి చేసామన్నారు. బీసీ కులాల విద్యకోసం ప్రత్యేక రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఏర్పాటు చేసి వారికి అంతర్జాతీయ స్థాయి విద్యనందించినామని కేసీఆర్ తెలిపారు. బీసీ బిడ్డల భవిష్యత్తు తరాల ప్రయోజనాలను నెరవేర్చేందుకు రాష్ట్ర రాజధాని నగరం హైద్రాబాద్ లో ఆత్మగౌరవ భవన నిర్మాణాల కోసం, అత్యంత విలువైన స్థలాలను, నిర్మాణ నిధులను,బీసీ కుల సంఘాలకు కేటాయించినామని తెలిపారు. బీసీ కులాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు పూలే ఆశయాలకు అనుగుణంగా తాము గత ప్రభుత్వంలో అమలులోకి తెచ్చిన ప్రగతి కార్యాచరణను చిత్తశుద్ధితో కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. తద్వారా మాత్రమే మహాత్మాపూలేకు మనం ఘన నివాళి అర్పించిన వారమవుతామని కేసీఆర్ స్పష్టం చేశారు.

## 'పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి'

నిడమనూరు, : సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిబా పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. జ్యోతి రావు పూలే 200వ జయంతి సందర్భంగా మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామజిక చైతన్యం కోసం పూలే చేసిన సేవలు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి తోట చందర్ రావు, నాయకులు కొండా శ్రీనివాస్ రెడ్డి, శేషరాజు శ్రీనివాస్, విశ్వనాధుల రమేశ్, మెరుగు మధు, శేషరాజు లక్ష్మినరేష్ దాసు, మేరెడ్డి వెంకటరమణ, మన్నెం శంకర్, కామ్మాల శ్రీను, గాయకవాడ లక్ష్మినారాయణ, మోర శంకర్ పాల్గొన్నారు.

## ఘోర బస్సు ప్రమాదం...

సూర్యాపేట సూర్యాపేట జిల్లాలోని కోదాడ వద్ద జాతీయ రహదారి నం. 65 పై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కనీసం 16 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుండి ఒక లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఇంటర్‌సిటీ ట్రావెల్స్ కు చెందిన ఈ బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సు హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరుకు ప్రయాణిస్తోంది .ప్రమాదం జరిగిన తర్వాత, భయాందోళనకు గురైన ప్రయాణికులు బస్సు కిటికీలను పగులగొట్టి బయటకు వచ్చారు. ఢీకొన్న తీవ్రత కారణంగా, బస్సు క్యాబిన్ లారీ వెనుక భాగంలో ఇరుక్కు పోయింది. సమాచారం అందిన వెంటనే, కోదాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ఒక జేసీబీ సహాయంతో బస్సు క్యాబిన్‌ను వెలికితీశారు. బస్సు డ్రైవర్ నిద్రమత్తులో వాహనం నడపడమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం రెండు అంబులెన్స్‌ల ద్వారా కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## అభివృద్ధి ఆగదు– మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే



మహబూబ్‌నగర్: ముడా నిధులతో రూ 20 లక్షలతో కమిటీ హాల్ నిర్మా ణానికి భూమి పూజ,రూ 166 లక్షలతో సల్లోనిపల్లి గ్రామం నుంచి పలువు తండకు నిర్మించనున్న బీటీ రోడ్డు కు, రూ 830.50 లక్షల తో ఆయకట్టు కు సంబంధించి మూ డు చెక్ డ్యామ్ల నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి ఎట్టి పరిస్థితిలో ఆగదని అందరూ సమిష్టిగా ఉంటూ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని స్పష్టం చేశారు. ఎక్కడ ఎలాంటి ఇన్ని సమస్యలు ఉన్నా ప్రతి సమస్యను పరిష్కరించుకోవడ వే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. మ న నగరం మహానగరంగా ఎదుగుతుందని ముందు అంచనాలతో ప్రతి ఒక్కరు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమం లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నా యకులు సిరాజ్ ఖాద్రీ, శ్రీ జయరామ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బెక్కెరి రాంరెడ్డి, కళ్యాణ్ , రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ లయన్ నటరాజ్, తదితరులున్నారు.

## పోలీసులకు చిక్కిన డ్రగ్ క్వీన్..



న్యూఢిల్లీ:ఢిల్లీ లో మాదక ద్రవ్యాల నెట్‌వర్క్‌ను నడుపుతూ 'డ్రగ్ క్వీన్' గా పేరుపొందిన కుసుమ్ అనే మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎన్నో ఏళ్లుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్న ఆమె ఆచూకీ కోసం పోలీసులు రెండు నెలల క్రితం సీక్రెట్ ఆపరేషన్ చేపట్టారు. వారాల తరబడి 200 సీసీటీవీ కెమెరాలు, 100 ఫోన్‌లను ట్రాక్ చేశారు. తాజాగా ఢిల్లీలోని షాదారా ప్రాంతంలోగల ఓ ఇంట్లో కుసుమ్ ఉన్నట్లు గుర్తించారు. సీక్రెట్‌గా ఆ ఇంట్లోకి వెళ్లి కుసుమ్‌ను అరెస్ట్ చేశారు. నిందితురాలిపై 11 కేసులు, రూ.50 వేల రివార్డు ఉన్నట్లు తెలిపారు. గతంలో కుసుమ్ ఢిల్లీలోని సుల్తాన్‌పురిలో డ్రగ్స్ విక్రయిస్తూ గ్యాంగ్‌స్టర్లతో కలిసి పనిచేసేది. క్రమంగా సొంత డ్రగ్ సిండికేట్‌ను ఏర్పాటు చేసుకొంది. ఢిల్లీలో హత్యలు, దోపిడీ, మాదకద్రవ్యాల దందాను చురుగ్గా నడిపిస్తోంది. అక్రమంగా కోట్ల రూపాయలు సంపాదించింది. పలు రాష్ట్రాలలోని మాదకద్రవ్యాల ముఠాలు ఆమె నేతృత్వంలోనే నడుస్తున్నాయి. ఆమె ఇద్దరు కుమార్తెలు, సోదరుడు కూడా ఇదే సిండికేట్‌లో పని చేస్తున్నారు. కుసుమ్ ఎక్కడా తనకు వ్యతిరేకంగా ఆధారాలు లేకుండా జాగ్రత్త పడేది. ఆమెపై అనుమానం ఉన్నప్పటికీ.. అదుపులోకి తీసుకోవడం పోలీసులకు సాధ్యం కాలేదు. 2003 నుంచి పోలీసులు ఆమె కోసం గాలిస్తున్నారు. వారు దాడులు చేపట్టిన ప్రతిసారీ కుసుమ్ మాయమైపోయేది. ఫోన్‌ను ఉపయోగించకుండా కొత్త ప్రదేశాల్లో తలదాచుకుంటూ ఉండేది.

## పూలే ఆశయ సాధనకు కృషి




న్యూఢిల్లీ: ప్రముఖ సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నివాళులర్పించారు. సమానత్వం, న్యాయం, విద్య కోసం తన జీవితాన్ని అంకితం చేశా రని ప్రధాని కొనియాడారు. మహిళలు, అణగారినవర్గాల హక్కుల పరిరక్షణలో పూలే మార్గదర్శి అన్నారు. పూలే ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు అర్పించే ఘనమైన నివాళి అన్నారు. ఢిల్లీలో జ్యోతిరావుపులే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలేకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని ఆమె పేర్కొన్నారు. "మహాత్మా జ్యోతిరావు పూలే తన జీవితాన్ని అణగారిన వర్గాల అభ్యున్నతికి అంకితం చేశారు. మహిళా విద్య పురోగతికి ఆయన గణనీయమైన కృషి చేసి, సామాజిక సంస్కరణలు, సమ్మిళితత్వం అనే శాశ్వత వారసత్వాన్ని వదిలివెళ్లారు," అని రాష్ట్రపతి ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. పార్లమెంట్ ఆవరణలోని ఫులే విగ్రహానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. ఉపరాష్ట్ర పతి, ప్రధాని మోదీ, లోక్ సభ స్పీకర్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీఫులే విగ్రహానికి నివాళులర్పించారు. ఫూలే ఏప్రిల్ 11, 1827న మహారాష్ట్రలో జన్మించి, నవంబర్ 28, 1890న మరణించారు.

## బాల్య వివాహాలు అరికట్టడంలో మైలురాయి..

రాజస్థాన్, రాజస్థాన్ అంటేనే మనకు రంగు రంగుల సంస్కృతితో పాటు దురదృష్టవశాత్తూ 'బాల్య వివాహాలు' కూడా గుర్తుకు వస్తాయి. ముఖ్యంగా అక్షయ తృతీయ, రావి పౌర్ణిమ వంటి సామూహిక ముహూర్తాల రోజున వందలాది మంది చిన్నారులకు తెలియకుండానే పెళ్లిళ్లు జరిగిపోతుంటాయి. ఈ సామాజిక రుగ్మతను వేర్లతో సహా తొలగించడానికి రాజస్థాన్ ప్రభుత్వం తీసుకున్న ఈ 'వెడ్డింగ్ కార్డ్' నిర్ణయం వినడానికి వింతగా ఉన్నా, ఆచరణలో మాత్రం మాస్టర్ స్ట్రోక్ అని చెప్పొచ్చు. చట్టాలు ఎన్ని ఉన్నా లూప్ హోల్స్ వెతికే వారికి రాజస్థాన్ ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. ఇకపై రాజస్థాన్‌లో పెళ్లి పత్రిక అంటే కేవలం ముహూర్తం, విందు వివరాలు మాత్రమే కాదు.. వధూవరుల 'వయసు ఎంత' అనే దానికి అది ఒక అధికారిక సాక్ష్యంగా మారబో తోంది. అక్షయ తృతీయ, రావి పౌర్ణిమ రోజుల్లో జరిగే వేలాది వివాహాలను పర్యవేక్షించడం అధికారులకు కష్టంగా మారుతున్న నేపథ్యంలో, ఈ కొత్త నిబంధనను తెరపైకి తెచ్చారు. బాల్య వివాహాలు ఎక్కువగా రహస్యంగా లేదా సామూహికంగా జరుగుతుంటాయి. పెళ్లి పత్రికలో వధూవరుల డేట్ ఆఫ్ బర్త్ ముద్రించడం తప్పనిసరి చేయడం ద్వారా, ఆ వివాహం చట్టబద్ధమైనదో కాదో గ్రామస్తులు, అధికారులు సులభంగా గుర్తించవచ్చు. ఒకవేళ పత్రికలో తప్పుడు వివరాలు ముద్రిస్తే, అది ఫోర్జరీ కేసు కిందకు వస్తుంది. అలాగే వయసు నమోదు చేయకుండా పత్రికలు ముద్రిస్తే సదరు ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యం కూడా చిక్కుల్లో పడుతుంది. ఈ నిర్ణయంలోని అత్యంత కఠినమైన భాగం ఇదే. బాల్య వివాహం జరిగితే కేవలం తల్లిదండ్రులనే కాదు.., ఆ పెళ్లికి సహకరించిన ప్రతి ఒక్కరినీ నింది తులుగా కేసులో నమోదు చేయబోతున్నారు. పెళ్లి జరిపించే పంతులు వయసు ధృవీకరణ పత్రాలు చూడకుండా ముహూర్తం పెడితే కటకటాల పాలవాల్సిందే. ఇక బ్యాండ్ మేళం.., వంటవారు, టెంట్ హౌస్ యజమానులు, ఫోటోగ్రాఫర్లు.. వీరంతా పెళ్లికి ముందే వధూ వరుల వయసు నిర్ధారించుకోవాలి. లేదంటేచట్టం కింద వీరిపై కేసులు నమోదు చేస్తారు. రాజస్థాన్‌లో అక్షయ తృతీయ (ఆఖా తీజ్) రోజున అబూజ్ ముహూర్తాలు (అత్యంత శుభప్రదమైనవి) ఉంటాయని నమ్ముతారు. ఆ ఒక్క రోజే వేల సంఖ్య లో పెళ్లిళ్లు జరుగుతాయి. ఇందులో చాలా వరకు బాల్య వివాహాలే ఉంటున్నాయని నివేదికలు చెబుతున్నాయి. అందుకే ఈ రెండు ప్రత్యేక రోజుల్లో వివాహం చేసుకునే వారు ఖచ్చితంగా పెళ్లి పత్రికలో డేట్ ఆఫ్ బర్త్ ముద్రించాలనే నిబంధనను ప్రభుత్వం కఠినతరం చేసింది. ఈ వినూత్న నిర్ణయంపై సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. 'ఒక చిన్న మార్పు పెద్ద సామాజిక మార్పుకు దారితీస్తుంది' అని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. విద్యావంతులైన వారు కూడా దీనిని సమర్థిస్తున్నారు. చదువుకోవాల్సిన వయసులో చిన్నారుల మెడలో తాళి కట్టడం వల్ల వారి భవిష్యత్తు అంధకారంగా మారుతుందని, ఇలాంటి కఠిన నిబంధనలు ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలని కోరుతున్నారు. రాజస్థాన్ ప్రభుత్వ నిర్ణయం బాల్య వివాహాలను అరికట్టడంలో మైలురాయిగా నిలవబోతోంది. భయం ఉన్న చోటే భక్తి ఉంటుంది అన్నట్లుగా.. కఠినమైన శిక్షలు ఉంటేనే ఇలాంటి అనాచారాలు ఆగిపోతాయి. పెళ్లి పత్రికలో డేట్ ఆఫ్ బర్త్ నమోదు చేయడం అనేది కేవలం ఒక నిబంధన మాత్రమే కాదు.. అది ఒక చిన్నారి బాల్యాన్ని కాపాడే ఆయుధం.

## హైడ్రా భారీ ఆపరేషన్.. 15 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి సేఫ్

హైద్రాబాద్: ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలు, నిర్మాణాలను నేలమట్టం చేస్తూ, రూ.కోట్ల విలువైన ఆస్తులను కాపాడుతున్న హైడ్రా మరోసారి బుల్డోజర్లకు పని చెప్పింది. సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ మండలం ఐలాపూర్ లో హైడ్రా భారీ ఆపరేషన్ ను చేపట్టింది. రెవెన్యూ, పురపాలక అధికారులతో కలిసి ఈ భారీ ఆపరేషన్ ను నిర్వహిస్తోంది. కోర్టు స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ నిర్మాణాలు జరిపిన ఓ గెస్ట్ హౌస్ తో పాటు ఆరు అంతస్తుల భవనాన్ని హైడ్రా నేలమట్టం చేసింది. కూల్చివేతల సందర్భంగా ఘర్షణ వాతావరణం తలెత్తకుండా పోలీసులు భారీగా మోహరించారు. ప్రభుత్వం, ఇనాం భూముల్లో అనధికారికంగా నిర్మించిన భవనాలకు సంబంధించి హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు రావడంతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో భవనాన్ని కూల్చి వేశారు. పేదల నివాసాల జోలికి వెళ్లకుండా : ఐలాపురం తండాతో పాటు గ్రామంలోని పేదలకు చెందిన ఇళ్ల జోలికి వెళ్లకుండా ఖాళీ స్థలాలను హైడ్రా స్వాధీనం చేసుకుంటోంది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపురం గ్రామంలో మొత్తం 1263 ఎకరాల ప్రభుత్వానికి చెందిన భూమి ఉంది. ఇందులో ఇప్పటికే చాలా నివాసాలు వెలిశాయి. ఆ నివాసాల జోలికి వెళ్లకుండా, మిగిలి ఉన్న 860 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడేందుకు హైడ్రా చర్యలు చేపట్టింది. 863 ఎకరాల భూమి విలువ రూ.15 వేల కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక్కడ యథాతథ స్థితిని (స్టేటస్ కో) కొనసాగించాలని 1998 నుంచి కోర్టు ఆర్డర్లిస్తున్నప్పటికీ పట్టించుకోకుండా నిర్మించిన గెస్ట్ హౌస్‌ను హైడ్రా తొలగించింది. కూల్చివేతల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పటు చేశారు. అక్రమణలు



గుర్తించేందుకు రెవెన్యూ, పురపాలక అధికారులతో కలిసి హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. ఐలాపూర్‌లో 6 అంతస్తుల భవనం కూల్చివేత : ఐలాపూర్ లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని హైడ్రా నేలమట్టం చేసింది. భవనంలో ఎవరూ నివాసం ఉండట్లేదని హైడ్రా గుర్తించింది. అధికారులు బుల్డోజర్లతో కూల్చి వేసేందుకు సిద్ధమయ్యే సరికి కొంతమందిని అద్దెకు దించి, నివాసాలున్నట్లుగా భవన నిర్మాణదారుడు చూపించాడు. బిల్డింగ్ లో ఉన్న వారిని ఖాళీ చేయించి ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగిస్తున్నారు.క ఐలాపూర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేతపై హైకోర్టు ఎలాంటి స్టే ఇవ్వలేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో హై డ్రా కూల్చివేతలపై తప్పుగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఐలాపూర్‌లో భూములపై 1998లో హైకోర్టు స్టేటస్ కో ఉందని తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి ముఖీమ్ ఫాంహౌస్ నిర్మించుకున్నాడని రంగనాథ్ అన్నారు. ఫాంహౌస్ కేంద్రంగా ప్రభుత్వ భూమి కబ్జాకు పాల్పడ్డాడని వివరించారు. 2006లో నిర్మించిన ఫాంహౌస్ ఇప్పుడు 40 ఎకరాలకు విస్తరించాడని వివరించారు. 20 ఏళ్లుగా ముఖీమ్ తన అనుచరులతో కలిసి భూదందా చేస్తున్నాడని రంగనాథ్ తెలిపారు. ప్రభుత్వ భూములను ప్లాట్లుగా విక్రయించి కోట్లు సొమ్ము చేసుకున్నాడని చెప్పారు. ముఖీమ్ 100 గజాలకు రూ.10 లక్షల చొప్పున పేదలకు విక్రయించాడన్నారు. ఐలాపూర్ లో అక్రమణలు నేలమట్టం చేయడంపై సంగారెడ్డి ఐలాపూర్ రాజగోపాల్ నగర వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, హైడ్రాకు ధన్యవాదాలు తెలియజేశారు. సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించి ముఖీం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. సంగారెడ్డి జిల్లా ఐలాపూర్ లో రాజగోపాల్ నగర్ ప్లాట్ యజమానులు 1980లో 4వేల ప్లాట్లను 495 ఎకరాలు కొనుగోలు చేశారు. అయితే అప్పటి నుంచి ముఖీం ప్లాట్ యజమానులకు అడ్డుపడటంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్టేటస్ కో ఆర్డర్ ను తేవడం ఆనందంగా ఉందని కాలనీ వా సులు తెలిపారు. ఇన్నేళ్లు ఏ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

దేశ టైమ్స్

# సంపాదకీయం

## కేరళ రాష్ట్రంలో మాత్రం ఒకరితో ఒకరు నువ్వానేనా అనే రీతిలో ఢీకొంటున్నారు...

ఈసారి పుదుచ్చేరి ఎన్నికల గురించి ప్రత్యేకంగా చర్చించవలసిందేమీ లేదు. కేరళ, అసోంల్లో ఈసారి ప్రభుత్వ వ్యతిరేకత బలమైన అంశంగా పనిచేయదని తెలుస్తోంది. కేరళలో సిపిఎం నేతృత్వం లోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రస్తుతం ప్రజల్లో వ్యక్తమవుతున్న ప్రభుత్వ వ్యతిరేకతతోను, కాంగ్రెస్ నేతృత్వం లోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్)తోనూ గట్టిగా పోరాడుతోంది. ఈ రెండు ఫ్రంట్‌లకు చెందిన సభ్యులంతా జాతీయ స్థాయిలో సంయుక్త వ్యతిరేక వేదికలో భాగస్వాములే అయినప్పటికీ, కేరళ రాష్ట్రంలో మాత్రం ఒకరితో ఒకరు నువ్వానేనా అనే రీతిలో ఢీకొంటున్నారు. బిజెపి విషయానికి వస్తే రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన పార్టీగా ఆ పార్టీ ఇంకా నిరూపించుకోవలసి ఉంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం వరుసగా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2021లో కేరళ రాజకీయ చరిత్రను తిరగరాస్తూ దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న ఎల్‌డిఎఫ్ కేరళలో ప్రతి ఐదేళ్లకు ప్రభుత్వాన్ని మార్చే సంప్రదాయాన్ని బద్దలు కొట్టి రెండోసారి అధికారం లోకి వచ్చింది.ఇప్పుడు మూడోసారి కూడా విజయం సాధించి చారిత్రాత్మక రికార్డు సృష్టించాలన్న పట్టుదలతో ఉంది. గత పదేళ్లలో లైఫ్ మిషన్, సామాజిక భద్రత పెన్షన్లు, అత్యంత పేదరిక నిర్మూలన, విద్య, వైద్య రంగాల్లో మార్పు, కూలీలకు కనీస వేతనం వంటి పథకాలు అమలు చేశామని, అవే తమను గెలిపిస్తాయని ఎల్‌డిఎఫ్ విస్తృతంగా ప్రచారం చేసింది. లైఫ్ మిషన్ పథకం కింద ఐదు లక్షల ఇళ్లను పేదల కోసం నిర్మించి పంపిణీ చేసింది. పేదరిక నిర్మూలన పథకం కింద దాదాపు 64,000 కుటుంబాలకు విముక్తి కలిగించింది. వ్యక్తిగత విమర్శల కంటే 'ప్రదర్శన ఆధారిత రాజకీయాల' పై ఎల్‌డిఎఫ్ దృష్టి సారించింది. అయితే రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు, పెన్షన్ల పంపిణీలో జాప్యం వంటివి విపక్షాల విమర్శలకు దారితీశాయి. ఇదిలా ఉండగా సిపిఎం పార్టీకి ఈసారి అనుకోని ప్రతిఘటనలు ఎదురయ్యాయి. అనుభవజ్ఞులైన, కీలకమైన సీనియర్ నేతలు ఐదుగురు పార్టీని విడిచిపెట్టి కాంగ్రెస్ మద్దతు గల యుడిఎఫ్ ఇండిపెండెంట్లుగా తిరుగుబాటు అభ్యర్థులుగా రంగం లోకి దిగారు.వీరిలో కొంతమంది 1967 నుంచి సిపిఎంకు కంచుకోట వంటి పయన్నూర్ వంటి స్థానాల్లో పోటీ చేస్తున్నారు. కేరళలో ఈ మూడు కూటములు బయటకు తీవ్రంగా పోరాడుతున్నట్టు కనిపిస్తున్నా లోపల మాత్రం పరస్పర ప్రయోజనాల కోసం ఒప్పందాలు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు ఓటర్లలో ఉత్కంఠ రేపుతున్నాయి. ఇక కాంగ్రెస్ నేతృత్వం లోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) విషయం పరిశీలిస్తే 2025 నాటి లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయోత్సాహంతో ఈ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి తీరాలన్న ఆకాంక్షతో ఉంది. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నాలుగు కార్పొరేషన్లను చేజిక్కించుకుంది. మలప్పురం వంటి బలమైన స్థానాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం కంటే ముస్లిం లీగ్ మెరుగైన ఫలితాలు సాధించడం గమనార్హం. 2021 అసెంబ్లీ ఎన్నికల పరాజయం తరువాత యుడిఎఫ్ కొత్త వారికి, యువకులకు అభ్యర్థులుగా అవకాశం కల్పించింది. తెలంగాణలో విజయవంతమైన హామీల నమూనాను కేరళలో అమలు చేయించాలని కాంగ్రెస్ యోచిస్తోంది.విద్యార్థులు, మహిళలు, యువతను ఆకర్షించేలా ఆరు గ్యారంటీలను ప్రకటించింది. చిన్న వ్యాపారుల కోసం రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు, రబ్బరు రైతులకు ప్రత్యేక మద్దతు ధర కిలోకు రూ. 250 వంతున కల్పన వంటి హామీలు ఇందులో ఉన్నాయి. అసోం అసెంబ్లీ ఎన్నికల గురించి పరిశీలిస్తే ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ రెండోసారి తానే ముఖ్యమంత్రిగా రావాలని, ఎన్‌డిఎ ప్రభుత్వం మూడోసారి విజయం సాధించాలన్న ఆశతో ఉన్నారు. శర్మ హిందుత్వ వాదాన్ని బలపరుస్తూ ముస్లిం వ్యతిరేక వాదన తీవ్ర రూపంగా మారుస్తున్నారు. అంతేకాదు ద్వేష ప్రసంగాలు చేయడంలో ఆయన ఆరితేరారు. 2018 నాటి తన ఎన్నికల అఫిడవిట్‌లో ఆయనపై 40 కేసులు నమోదై ఉన్నాయని తేలింది. వీటిలో చాలా కేసులు ద్వేషపూరిత ప్రసంగాలకు సంబంధించినవే. ఇక్కడ ముస్లిం చొరబాటుదారుల ఏరివేత. అభివృద్ధి ప్రాజెక్టులు, హిందుత్వ అతివాదం ఇవే ప్రధాన లక్ష్యాలుగా బిజెపి పనిచేస్తోంది. గోహింస, లవ్ జీహాద్, మతమార్పిడి వంటివి ప్రధాన సమస్యలుగా పేర్కొంటోంది.సంక్షేమ పథకాలకు సంబంధించి అరుణోదయ పథకం కింద 40 లక్షల మందికి నేరుగా నెలకు రూ. 1250 వంతున ఆర్థికసాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. రాష్ట్రం నుంచి చొరబాటుదార్లను తరిమికొట్టడం, అక్రమ ఆక్రమణలను నివారించడం తప్పనిసరి అంటున్నారు. ఇక కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్‌కు పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయని సిఎం తీవ్ర ఆరోపణలు చేయగా, దీనికి ప్రతిగా గొగోయ్ సిఎం శర్మ భార్యకు యుఎఇ, ఈజిప్టు, బర్బ్బార్ తదితర మూడు దేశాల పాస్ పోర్టులున్నాయని, ఓడిపోతే విదేశాలకు పారిపోడానికి సిద్ధంగా ఉన్నారని ఆరోపణలు సంచలనం కలిగిస్తున్నాయి. ఇక పుదుచ్చేరిలో ఆల్ ఇండియా ఎన్‌ఆర్ కాంగ్రెస్ నేత ఎన్ రంగస్వామి నాయకత్వంలో ఎన్‌డిఎ ప్రభుత్వం 2021 నుంచి అధికారంలో ఉంది. ఇక్కడ ఉన్న నియోజకవర్గాలు కేవలం 30 మాత్రమే ఉన్నప్పటికీ పార్టీల రాజకీయాల కన్నా అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ట, ప్రజలతో మమేకం కావడం, సామాజిక సంబంధాలు తదితర అంశాలే విజయానికి కారణాలవుతాయి.

## హైదరాబాద్‌లో రౌడీషీటర్లకు డ్రగ్స్ పరీక్షలు...



హైద్రాబాద్: తెలంగాణ సర్కార్ డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే డ్రగ్స్ వినియోగం, సరఫరాను నియంత్రించేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పలు సందర్భాల్లో ఆకస్మిక తనిఖీలను సైతం నిర్వహిస్తున్నారు. తాజాగా హైదరాబాద్ పోలీసులు రౌడీ షీటర్లకు డ్రగ్స్ టెస్ట్ నిర్వహించారు. ఇప్పటివరకు పరీక్షించిన 239 మందిలో, సుమారు 189 మంది గంజాయి సేవించినట్లు తేలింది. దీంతో నగరంలో మాదకద్రవ్యాలను సరఫరా చేసే వారిపై చర్యలను మరింత ముమ్మరం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇక, నగరంలో ప్రస్తుతం 1,300 మందికి పైగా రౌడీషీటర్లు ఉన్నారు.ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... హైదరాబాద్‌లో రౌడీ షీటర్ల నేర కార్యకలాపాలు పెరిగిపోతున్న నేపథ్యంలో నగర పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశాల మేరకు రౌడీషీటర్లకు డ్రగ్ టెస్టులు నిర్వహిస్తున్నారు.ఇందులో టాస్క్ ఫోర్స్, హెచ్-న్యూ, స్థానిక పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో రౌడీ షీటర్లు, మాదకద్రవ్యాల వినియోగదారులకు ఆకస్మిక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ నగర పోలీసుల హెచ్-న్యూ టాస్క్ ఫోర్స్ బృందం స్థానిక పోలీసుల సమన్వయంతో ఏప్రిల్ 9వ తేదీన మాదకద్రవ్యాల నివారణకు సంబంధించి ఒక స్పెషల్ యాంటీ డ్రగ్ డ్రైవ్‌ను నిర్వహించినట్టుగా నగర పోలీసులు తెలిపారు.మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే చట్టపరమైన పర్యవసానాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ డ్రైవ్ చేపట్టినట్టుగా చెప్పారు. ఇందులో భాగంగా రౌడీ షీటర్లు, అల్లరి మూకలు, మాదకద్రవ్యాలకు బానిసలైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టుగా చెప్పారు. ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, గాంధీ ఆసుపత్రి, ఎర్రగడ్డలోని ప్రభుత్వ మానసిక ఆరోగ్య ఆసుపత్రి పరిధిలో మొత్తం 239 మందికి పరీక్షలు నిర్వహించగా... వారిలో 189 మందికి గంజాయి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని తెలిపారు. డ్రగ్స్ పాజిటివ్‌గా నిర్దారణ అయినవారికి మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, రీహాబిలిటేషన్‌పై మానసిక వైద్య నిపుణులు కౌన్సెలింగ్ ఇచ్చినట్టుగా నగర పోలీసులు వెల్లడించారు. డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు ప్రారంభిస్తున్నట్టుగా తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ టాస్క్ ఫోర్స్, హెచ్-న్యూ విభాగాల సీనియర్ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించినట్టుగా నగర పోలీసులు తెలిపారు. మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కల్పించడం, రీహాబిలిటేషన్ చర్యలను ప్రోత్సహించడంతో పాటు, చట్టాలను కఠినంగా అమలు చేయడంలో తమ నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటించామని హైదరాబాద్ నగర పోలీసులు తెలిపారు. ఇదిలాఉంటే, రాష్ట్రంలో మాదక ద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో ఆదేశించారు.

## మహిళల భద్రతే లక్ష్యం- సీపీ సజ్జనార్



హైదరాబాద్: పబ్లిక్, ప్రైవేట్ ప్రదేశాల్లో రహస్య కెమెరాలతో మహిళలను చిత్రీకరించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. అందుకోసం ఇవాళ 'షీ నేత్ర టీమ్స్'ను రంగంలోకి దింపినట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లో మహిళల భద్రతే లక్ష్యంగా షీ నేత్ర టీమ్స్‌ను ఆయన ప్రారంభించారు.ాగ్యనగరంలో 7 జోన్లకు 7 ప్రత్యేక షీ నేత్ర టీమ్స్‌ను ఏర్పాటు చేశారు సీపీ సజ్జనార్. ఆయన తన చేతుల మీదుగా ఆయా బృందాలకు కెమెరా డిటెక్టర్ల అందజేశారు. మహిళల ఆత్మగౌరవం, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే రహస్య కెమెరాల గుట్టును ఈ బృందాలు రట్టు చేయనున్నాయి. నగరవ్యాప్తంగా హోటళ్లు, మాల్స్, హాస్టళ్లు వంటి ప్రదేశాల్లో రహస్య కెమెరాలపై ఉక్కుపాదం మోపనున్నాయి. ముఖ్యంగా బట్టల దుకాణాల్లోని ట్రయల్ రూమ్స్, ప్రైవేట్ ప్రదేశాల్లో ప్రత్యేక తనిఖీలు చేయనున్నారు. ఇకపై అత్యాధునిక కెమెరా డిటెక్టర్లతో ఆకస్మిక సోదాలు నిర్వహించనున్నారు.ఈ బృందాల ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడిన సీపీ సజ్జనార్.. బట్టల దుకాణాలు, హోటళ్లు, హాస్టళు,, మాల్స్ వంటి ప్రాంతాల్లో ఆడవారి భద్రత ఆయా సంస్థల యాజమాన్యాలదే అని తేల్చి చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే సంస్థలు, సిబ్బందిని బ్లాక్‌లిస్టులో పెట్టే విధంగా చర్యలు ఉంటాయని చెప్పారు. ప్రతి సంస్థలో కస్టమర్ సేఫ్టీ ఇన్‌ఛార్జ్ నియామకం తప్పనిసరని ఆదేశాలిచ్చారు. షీ టీమ్స్‌తో సమన్వయం కోసం నోడల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆజ్ఞాపించారు. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీపీ సజ్జనార్ సూచించారు.

## నమ్మక ద్రోహిలకు మానం, మర్యాద, సిగ్గూ ఎగ్గూ ఉండవు!

న్యూఢిల్లీ: నమక్‌హరామ్ (నమ్మక ద్రోహి)లకు మానం, మర్యాద, సిగ్గూ ఎగ్గూ ఉండవు. ఎంతకైనా తెగించే దుర్మార్గానికి పాల్పడతారు.అలాంటి వారిని పాలుతాగి రొమ్ము.....బాపతు అంటారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. 'అతని బతుకే అంత , ఏ మాట, ఏ చేతనూ నమ్మటానికి లేదని' ఇరాన్ మొదటి నుంచీ మొత్తుకుంటున్నది. చరిత్ర చెప్పిన సత్యం. అయినప్పటికీ యావత్ ప్రపంచం పశ్చిమాసియా సంక్షోభానికి ముగింపు పలకాలని వాంఛిస్తున్నది గనుక ట్రంప్‌తో అవగాహన, తదుపరి ఒప్పందం చేసుకోవటానికి అంగీకరించింది. మీడియాలో వచ్చినట్లు దీనివెనుక చైనా సలహాకూడా ఉండివుండవచ్చు. మంచి కోరుకొనే వారెవరైనా అలాంటి సలహాలే ఇస్తారు. ఆ ఒప్పంద వార్తలను అందరూ చదవకముందే, ఆ మాటలు చెవుల్లో ఇంకా గింగురుమంటూనే ఉండగా కొద్ది గంటల్లోనే ఉల్లంఘించి ఇజ్రాయిల్‌తో దాడులు చేయిస్తున్నాడు. దానికి ప్రతిగా ఇరాన్‌కూ దెబ్బకు దెబ్బతీయక తప్పటం లేదు. ఇరాన్ అందచేసిన పది అంశాలు, అమెరికా ముందుంచిన పదిహేను అంశాల్లో ఏవైనా సందేహాలుంటే మధ్యవర్తుల ద్వారా వాటిని నిర్ధారించుకోవాలి. కానీ, లెబనాన్‌పై దాడులు నిలిపివేయాలని ఒప్పందంలో లేదంటూ ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు తొలుత ప్రకటించి భీకరదాడులు చేయిస్తున్నాడు.ఆ దుర్మార్గుడికి మద్దతుగా నిజమే అంటూ అదొక ప్రత్యేక తగాదా అని, పొరపాటుగా అర్థం చేసుకున్నట్లు ఉందని డోనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ పచ్చి అబద్దాలు చెప్పారు. ఒప్పందంలో లెబనాన్ కూడా ఉందని మధ్యవర్తిగా ఉన్న పాకిస్తాన్ ప్రధాని సెహబాజ్ షరీఫ్ ఒప్పందం గురించి విలేకర్ల సమావేశంలో స్పష్టంగా ప్రకటించాడు. ఇజ్రాయిల్ దుష్ట చర్యను గురువారం నాడు షరీఫ్ తీవ్రంగా ఖండించాడు. ఈ దుష్టత్రయం ఎందుకు మాట మార్చినట్లు? ఏం సాధించారని కాల్పుల విరమణకు అంగీకరించారంటూ యావత్ ప్రపంచం, అమెరికాలో స్పందనలు వెల్లువెత్తటంతో ట్రంప్‌కు దిక్కుతోచి ఉండదు. అందుకే ఇజ్రాయిల్ ముసుగులో దాడులు కొనసాగించేందుకు ట్రంప్ నిర్ణయించినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. నిండా మునిగిన ఇరాన్‌కు పోయేదేమీ లేదు, అమెరికా కోసం అంగలార్చేవారు కూడా ఒకటికి పదిసార్లు కుక్కతోక పట్టుకొని గోదారిని ఈదగలమా అని ఆలోచించక పోరు. ప్రపంచానికి కావాల్సింది కూడా అదే.డోనాల్డ్ ట్రంప్ ఆ "పుణ్యం" కట్టుకున్నందుకు నిజంగా "అభినందించాల్సిందే" మరి! ఇస్లామాబాద్‌లో ఇంకా చర్చలు ప్రారంభంగాక ముందే తమ ప్రతిపాదనల్లో మూడు అంశాలను అమెరికా ఉల్లంఘించిందని ఇరాన్ ప్రకటించింది. లెబనాన్‌పై దాడులు, తమ గగనతలాన్ని అతిక్రమించి డ్రోన్ల ప్రయోగం, యురేనియంను శుద్ధిచేసే తమ హక్కును కాదనటంగా పేర్కొన్నది. ఇరాన్‌కు ఆయుధాలు ఇచ్చే వారి తాటతీస్తానని కూడా ట్రంప్ నోటితుత్తరను బయటపెట్టుకున్నాడు. అమెరికా ఉల్లంఘనల కారణంగా హోర్ముజ్ జలసంధిని తిరిగి ఇరాన్ మూసివేసింది. తమ అనుమతి ఉన్న నౌకలకు అనుమతి ఇస్తున్నది. దీన్నే సాధారణ రాకపోకలు సాగుతున్నట్లు అమెరికా వర్ణిస్తున్నది. తమ అనుమతి లేని నౌకలు అటూ ఇటూ తిరిగితే పేల్చివేస్తామని ఇరాన్ ప్రకటించింది. లెబనాన్ పేరుతో చర్చలు విఫలం కావాలని ఇరాన్ కోరుకుంటే తాము చేసేదేమీ లేదని జెడి వాన్స్ ఎదురు దాడికి దిగాడు.రెండు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పం దం స్పష్టంగా ఉంది.కాల్పుల విరమణ లేదా ఇజ్రాయిల్ ద్వారా దాడులు సాగించటమా, ఏదో ఒకటి తేల్చుకోవాలి తప్ప రెండూ చేస్తామంటే కుదరదు. లెబనాన్‌లో జరుగుతున్న మారణ కాండను ప్రపంచం చూస్తున్నది, బంతి ఇప్పుడు అమెరికా కోర్టులో ఉందని ఇరాన్ విదేశాంగ మంత్రి స్పష్టం చేశాడు. అమెరికా అతి తెలివి ప్రదర్శించి దాడులను కొనసాగిస్తే ఎర్రసముద్రం-అరేబియా సముద్రం ద్వారా హిందూమహాసముద్రంలో ప్రవేశించే జలసంధి మార్గం బాబ్ ఎల్ మండాబ్‌ను కూడా దిగ్బంధనం చేయించేందుకు ఇరాన్ గతంలోనే హెచ్చరించింది. అది గనుక జరిగితే ప్రపంచ సంక్షోభం ఇంకా తీవ్రమవుతుంది. ట్రంప్ వరుస చూస్తుంటే దాన్నీ వదిలేట్లు లేదు.హోర్ముజ్ జలసంధికి అమెరికాకు మధ్య పన్నెండువేల కిలోమీటర్ల దూరం ఉంది, దాని ఇరుగూ కాదు పొరుగూ కాదు. తమపై దాడులు చేసి కలిగించిన నష్టానికి అమెరికా పరిహారం చెల్లించాలని ఇరాన్ డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. అది జరుగుతుందో లేదో తెలియదు గనుక ఆ మార్గంలో ప్రయాణించే నౌకల నుంచి రుసుము వసూలు చేసి దాన్ని ఎమెన్‌తో పంచుకుంటామని, తమకు కలిగిన దాడుల నష్టాలను పూడ్చుకుంటామని ఇరాన్ ప్రకటించింది. అయితే ఇరాన్‌తో కలసి తాము పన్ను వసూలు చేస్తామని ట్రంప్ ప్రకటించటం తెంపరితనం తప్ప మరొకటి కాదు. తన చెప్పుచేతల్లో ఉంటాయనుకున్న నాటో దేశాలే ఇరాన్ సంక్షోభంతో తమకు సంబంధం లేదని తెగేసి చెప్పాయి.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

నల్లగొండ : ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం వేగవంతం చేయాలని రైతు సంఘం నాయకుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు. రైతు సంఘం నల్లగొండ మండల మహాసభ నల్లగొండలోని సుందరయ్య భవనంలో శుక్రవారం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారులు త్వరితగతిన బస్తాలను, లారీలను ఏర్పాటు చేసి వడ్ల కొనుగోలును వేగవంతం చేయాలన్నారు. నేటికీ మండలంలోని అనేక వడ్ల కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్లు మాచర్ వచ్చినా సరే తాలుపట్టాలని రైతులను అధికారులు ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. గత సీజన్ సన్న వడ్లకు నేటికీ బోనస్ రైతుల అకౌంట్‌లో వేయలేదన్నారు. ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ కనీసం రైతుల దుస్థితి పట్టించుకున్న నాథుడు లేదని విమర్శించారు. కొనబోతే కొరవి అమ్మబోతే అడవి అన్న చందం లాగా రైతుల పరిస్థితి తయారైందన్నారు. సమయానికి సరిపడా యూరియా అందించలేని రాష్ట్ర ప్రభుత్వం కనీసం వచ్చే సీజన్ కైనా ముందస్తు ప్రణాళిక ప్రకారం రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. రైతులకు అవసరమయ్యే వ్యవసాయ పనిముట్లకు సబ్సిడీలను వెంటనే అందజేయాలని, ఇచ్చిన పరికరాలకు రిపేర్లు వస్తే ఆ కంపెనీ టెక్నీషియన్స్ వెంటనే స్పందించి రిపేర్లు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 14వ తేదీన ఏచూరి గార్డెన్‌లో రైతు సంఘం జిల్లా మహాసభలు పెద్ద ఎత్తున జరగనున్నట్లు తెలిపారు. రైతుల సమస్యలపై ఈ మహాసభల్లో చర్చించి ప్రణాళికని ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ మహాసభని రైతులు విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. మహాసభ అనంతరం నూతన కమిటీని 15 మందితో ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా ఏపూరి జానయ్య, ప్రధాన కార్యదర్శిగా దొండ కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా బిట్ల వెంకట్ రెడ్డి, కుద్దాల భూపాల్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్ కుందారపు, సైదులు, సభ్యులుగా విజయ రెడ్డి, నాగేశ్వర్, ఆవుల యాదయ్య, సత్తయ్య, బత్తుల బక్కయ్య, సైదాచారి ఎన్నికయ్యారు.

## ప్రపంచంలో అత్యంత ప్రమాదకర దేశాలు ఇవే..!

న్యూఢిల్లీ: 2026 నాటికి ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను నిశితంగా గమనిస్తే.. కేవలం సరిహద్దు యుద్ధాలే కాదు.., అంతర్గత కుమ్ములాటలు కూడా దేశాలను నాశనం చేస్తున్నాయి. మీరు పేర్కొన్న దేశాలతో పాటు ప్రస్తుతం సుడాన్ ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన దేశంగా మొదటి స్థానంలో నిలిచింది. ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరిన ఈ తరుణంలో, భద్రత పరంగా గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్న కొన్ని దేశాల గురించి తెలుసుకుందాం..ప్రస్తుతం 2026లో శాంతి అనేది ఒక అందని ద్రాక్షలా మారుతోంది. గ్లోబల్ పీస్ ఇండెక్స్, తాజా రిస్క్ మ్యాప్స్ ప్రకారం.., కొన్ని దేశాలు మానవ నివాసానికి ఏమాత్రం యోగ్యం కానంతగా మారిపోయాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఐదో ఏడాదిలోకి అడుగుపెట్టడం, పశ్చిమాసియాలో ముదురుతున్న సంక్షోభం ప్రపంచ భవిష్యత్తునే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అత్యంత రిస్క్ ఉన్న 5 దే శాల గురించి ప్రపంచం కలవరపడుతుంది. ప్రస్తుతం ప్రపంచంలోనే నంబర్ 1 అత్యంత ప్రమాదకరమైన దేశంగా సుడాన్ నిలిచింది. ఇక్కడ జరుగుతున్న అంతర్యుద్ధం లక్షలాది మంది ప్రాణాలను బలితీసుకుంటోంది. సైనిక విభాగాల మధ్య సాగుతున్న ఈ పోరులో సామాన్యులు ఆహారం, నీరు దొరకక అల్లాడుతున్నారు. 2026లో కూడా ఇక్కడ శాంతి చర్చలు సఫలం కాకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది.దశాబ్ద కాలంగా యుద్ధంతో కుదేలైన యెమెన్ పరిస్థితి ఇంకా మెరుగవలేదు. 80 శాతం జనాభా కేవలం విదేశీ సాయంపైనే ఆధారపడి బతుకుతున్నారు. హౌతీ తిరుగుబాటుదారులు, అంతర్జాతీయ దళాల మధ్య ఘర్షణల వల్ల దేశం శిథిలాల కుప్పగా మారిపోయింది. ఇక్కడ కరువు.., కలరా వంటి వ్యాధులు యుద్ధం కంటే ఎక్కువ మందిని చంపుతున్నాయి.2022లో మొదలైన రష్యా దురాక్రమణ 2026 నాటికి ఐదేళ్లు పూర్తి చేసుకుంది. ఇప్పటికీ క్షిపణి దాడులు, డ్రోన్ దాడులతో ఉక్రెయిన్ నగరాలు దద్దరిల్లుతూనే ఉన్నాయి. యూరోపియన్ యూనియన్ నుంచి భారీ ఆర్థిక సాయం అందుతున్నప్పటికీ, మౌలిక వసతులు పూర్తిగా దెబ్బతినడంతో సామాన్యుల జీవితం నరకప్రాయంగా మారింది. ప్రపంచంలోనే అత్యంత భారీగా మైనింగ్ (నేల బాంబులు) జరిగిన దేశంగా రికార్డు సృష్టించింది. ఉక్రెయిత్ తో యుద్ధం కారణంగా రష్యా కూడా తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటోంది. అంతర్జాతీయ ఆంక్షలు ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయగా, దేశంలో పౌర స్వేచ్ఛ పూర్తిగా కనుమరుగైంది. భద్రతా దళాల నిఘా, బలవంతపు సైనిక సమీకరణ వల్ల ప్రజలు భయంతో బతుకుతున్నారు. విదేశీయులకు ముఖ్యంగా పశ్చిమ దేశాల వారికి ఇక్కడ పర్యటించడం ప్రమాదకరంగా మారింది.ఆఫ్రికా ఖండంలోని ఈ దేశం అక్రమ మైనింగ్, సాయుధ ముఠాలకు అడ్డాగా మారింది. ఇక్కడ ఉన్న అపారమైన ఖనిజ సంపద కోసం వివిధ వర్గాల మధ్య నిరంతరం యుద్ధాలు జరుగుతూనే ఉంటాయి. ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో మహిళలు, పిల్లలపై అరాచకాలు ఇక్కడ నిత్యకృత్యంగా మారాయి.ఈ జాబితాలో ఆఫ్ఘనిస్తాన్, హైతీ, మయన్మార్, సోమాలియా కూడా తీవ్రమైన భద్రతా సవాళ్లను ఎదుర్కొంటున్నాయి.

# వేసవి సెలవుల్లో యువత జాగ్రత్త

ఖమ్మం, వేసవి సెలవుల్లో యువత జాగ్రత్తగా ఉండాలని బూర్గంపహాడ్ ఎస్ఐ మేడా ప్రసాద్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో చెరువులు, వాగులు, కిన్నెరసాని, గోదావరి తదితర ప్రాంతాల్లో ఈతకు వెళితే యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. గోదావరి, కిన్నెరసాని ప్రాంతాల్లో యువత స్నానం చేద్దామని దిగితే లోతు తెలియకుండా నీటిలో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వారంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సెలవు సమయాల్లో చెరువులు, కుంటల వైపు వెళ్లనీయకుండా పర్యవేక్షణ చేయాలని, వేసవి సెలవు సమయాల్లో క్రీడలు, డ్రాయింగ్ తదితర వాటిపై నైపుణ్యత ప్రదర్శించాలని, ఆ విధంగా తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు.స్కూల్‌లో జరుగుతున్న పరీక్షలు రాసేందుకు విద్యార్థులు హాజరయ్యారు. స్కూల్ ప్రాంగణంలో ఉన్న వారిపై తేనెటీగలు దాడి చేశాయి. దీంతో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. ఒక బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మరణించాడు. ఈ సంఘటన జరిగింది. సోయత్‌కళలోని స్వామి వివేకానంద పాఠశాలలో పరీక్షలు జరుగుతున్నాయి.

# జోష్ సినిమా ఆడదని ముందే తెలుసా?



టాలీవుడ్లో పెద్ద కుటుంబాల నుంచి వచ్చిన యువ కథానాయకుల్లో అత్యంత ఆడంబరంగా జరిగిన అరంగేట్రం అక్కినేని నాగచైతన్యదే అని చెప్పొచ్చు. టాలీవుడ్లో నంబర్ వన్ నిర్మాతగా ఉన్న దిల్ రాజు.. వాసు వర్మ అనే కొత్త దర్శకుడితో నాగార్జున కెరీర్లో మైల్ స్టోనీ మూవీ అయిన 'శివ' లైన్లోనే ఎంతో జాగ్రత్తగా కథ రెడీ చేయించి.. పెద్ద బడ్జెట్లో సినిమా తీసి చైతూను లాంచ్ చేశాడు. అక్కినేని నాగేశ్వరరావు సహా ఇండస్ట్రీకి చెందిన అతిరథ మహారథులు.. ఈ సినిమా ఈవెంట్లలో పాల్గొన్నారు. కానీ చైతూ తొలి చిత్రం 'జోష్' అంచనాలను అందుకోలేకపోయింది. బాక్సాఫీస్ దగ్గర డిజాస్టర్‌గా నిలిచింది. అలా అని అది తీసిపడేయదగ్గ సినిమా కాదు. అందులో విషయం ఉంటుంది. కానీ ఆ కంటెంట్ మిస్ ఫైర్ అయింది. ఐతే 'జోష్' ఆడదని తనకు ముందే తెలుసని.. మొదట్నుంచి ఆ చిత్రం మీద ధీమాగా లేనని.. ఈ విషయాన్ని నిర్మాత దిల్ రాజుకు సైతం ముందే చెప్పానని అంటున్నాడు సీనియర్ హీరో జేడీ చక్రవర్తి.'జోష్' షినిమాలో జేడీనే విలన్ పాత్రను పోషించిన సంగతి తెలిసిందే. 'శివ'లో రౌడీయిజం చేసే కాలేజీ కుర్రాడి పాత్ర చేసిన జేడీ.. అందులో రఘువరన్ చేసిన భవానీ తరహా విలన్ క్యారెక్టర్‌ను 'జోష్'లో పోషించాడు. తన పాత్ర, పెర్ఫామెన్స్ బాగున్నప్పటికీ.. సినిమా వర్కవుట్ కాలేదు. అది వర్కవుట్ కాదని తనకు ముందే తెలుసని 'గాయపడ్డ సింహం'లో తన పాత్ర పరిచయానికి సంబంధించి నిర్వహించిన ప్రెస్ మీట్లో జేడీ తెలిపాడు. "జోష్ సినిమా విషయంలో నేను ముందు నుంచి కాన్ఫిడెంట్‌గా లేను. అది వర్కవుట్ కాదేమో అని కథ విన్నపుడే అనిపించింది. ఈ విషయాన్ని నేనేమీ దాచుకోలేదు. నిర్మాత దిల్ రాజుకు చెప్పాను. ఆయన కూడా రిలీజ్ రోజు మిక్స్డ్ టాక్ వచ్చినపుడు నా మాటల గురించి ప్రస్తావించారు.నేను నిజాయితీగా మాట్లాడతానని కాదు. నా మనసులో ఏమనిపించినా దాచుకోలేను. 'జోష్' విషయంలో కూడా అనిపించింది చెప్పేశా" అన్నాడు జేడీ. ఇక 'గాయపడ్డ సింహం'లో తన పాత్ర గురించి చెబుతూ.. ప్రపంచంలోనే అత్యంత విలక్షణ నటుడైన కమల్ హాసన్ కూడా చేయని పాత్ర ఈ సినిమాలో తనకు దక్కిందని.. ఈ క్యారెక్టర్ ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని పంచుతుందని జేడీ అభిప్రాయపడ్డాడు.

# మాస్ మసాలా వదలని నాగశౌర్య



రంగబలి తర్వాత నాగశౌర్య తెరమీద కనిపించి రెండేళ్లు దాటిపోయింది. వరస డిజాస్టర్లతో మార్కెట్ డ్యామేజ్ అయిన టైంలో సరైన కంబ్యాక్ కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఛలో తర్వాత మళ్ళీ అంత పెద్ద హిట్టు తనకు దక్కపోవడం విచిత్రమే. ఇదిలా ఉండగా నాగ శౌర్య కొత్త మూవీ బ్యాడ్ బాయ్ కార్తీక్ ఈ నెల ఏప్రిల్ 17 విడుదలకు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా ట్రైలర్ లాంచ్ చేశారు. తెలిసో తెలియకో తప్పులు చేశామని నిర్మాత హీరోకు సారి చెప్పడం వైరల్ అవుతోంది.ఇక ట్రైలర్ విషయానికి వస్తే నాగశౌర్య ఈసారి కూడా ఓవర్ మాస్ ట్రై చేసినట్టు ఉన్నాడు. అన్యాయాన్ని సహించని హీరో, ఒక అవినీతి రాజకీయ నాయకుడు, ఒక మాఫియా డాన్, జులాయిలో రాజేంద్ర ప్రసాద్ లాంటి ఒక కామెడీ పోలీస్ ఆఫీసర్ వెరసి పక్కా ఫార్ములా తరహాలో కంటెంట్ వెళ్ళిపోయింది. ఒక షాట్ లో నాగశౌర్య కత్తి పట్టుకుని రౌడీల మీదకు వస్తుంటే వెనుక నరసింహస్వామి స్వరూపాన్ని బ్యాక్ షాట్ లో చూపించడం బోయపాటి శీనుని గుర్తు చేసింది.దర్శకుడు రమేష్ రిస్క్ లేని గేమ్ ఆడాలని చూసినా ఇప్పుడున్న పరిస్థితుల్లో నాగశౌర్యని ఇంత మాస్ గా చూపించడం ఒక రకంగా సవాలే. ఇందులో కొన్ని విశేషాలున్నాయి. దీనికి హారిస్ జైరాజ్ సంగీతం సమకూర్చారు. మ్యూజిక్ లవర్స్ చాలా మందికి అసలీ విషయమే తెలియదు. ప్రభాస్ ఈశ్వర్ తో పరిచయమైన హీరోయిన్ శ్రీదేవి విజయ్ కుమార్ ఇందులో నిజాయితీ కలిగిన లాయర్ గా ఒక ముఖ్య పాత్ర పోషించడం గమనార్హం.ట్రైలర్ కోణంలో చూస్తుంటే కొత్తదనం లేదు కానీ ఆర్టిస్టుల ప్యాడింగ్, టెక్నికల్ వర్క్ గట్రా గట్టిగానే ఉన్నాయి. ఒకవేళ రొటీన్ కథతోనే మాస్ ని మెప్పించేలా ఏమైనా తీసి ఉంటే బాక్సాఫీస్ దగ్గర పనవ్వొచ్చేమో కానీ ఇప్పుడీ ట్రైలర్ వల్ల అంచనాలు అమాంతం పెరగడం లాంటివైతే జరిగేలా లేవు. రిలీజ్ ఇంకా పది రోజుల దూరంలో ఉంది కాబట్టి పబ్లిసిటీ, ప్రమోషన్లు వీలైనంత క్రియేటివ్ గా ప్లాన్ చేసుకోవడం వల్ల బజ్ పెంచుకునే అవకాశాలున్నాయి. చూడాలి మరి ఏం చేస్తారో.

# ఉత్తరప్రదేశ్ ఎస్ఐఆర్ తుది జాబితా విడుదల




ఉత్తరప్రదేశ్: ఉత్తరప్రదేశ్ ఎస్ఐఆర్ తుది జాబితాను ఆ రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ నవదీప్ రిన్వా విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్నోలో లోక్‌భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రిన్వా మాట్లాడుతూ ఎస్ఐఆర్ ముసాయిదా జాబితా కంటే.. తుది జాబితాలో 84 లక్షల మందికిపైగా ఓటర్లు చేరారని, మొత్తం ఓటర్ల సంఖ్య 13.39 కోట్లకు చేరిందని ఆయన వెల్లడించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ అక్టోబర్ 7 – – 2025 నుంచి ఏప్రిల్ 10 -- 2026 వరకు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియ 75 జిల్లాల్లో 403 అసెంబ్లీ నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాలను కవర్ చేసిందని ఆయన పేర్కొన్నారు. జనవరి 6 -- 2026న ఎస్ఐఆర్ యుసాయిదా జాబితాను రిన్వా విడుదల చేశారు. ఆ జాబితాలో 12,55,56,025 మంది ఓటర్లున్నారు. ఇందులో 6.88 కోట్ల మంది పురుషులు, 5.67 కోట్ల మంది మహిళలు, 4,199 ట్రాన్స్‌జెండర్ ఓటర్లున్నారు. 18--19 వయసు గల ఓటర్లు 3,33,981 మంది ఉన్నారు. ప్రతి వెయ్యి మంది పురుషులకు 824 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.ఇక నేడు విడుదల చేసిన తుది జాబితాలో ఓటర్ల సంఖ్య 13,39,84,792 మంది ఉన్నారు. పురుషుల ఓటర్లు 7,30,71,071 (54 శాతం), మహిళా ఓటర్లు 6,09,09,525 (45.46 శాతం), ట్రాన్స్ జెండర్ ఓటర్లు 4,206 (0.01 శాతం కన్నా తక్కువ) ఉన్నారు. ముసాయిదా జాబితా కంటే తుది జాబితాలో 18–19 వయసు గలవారు 17,63,360కి పెరిగారు. సుమారు 1.32 శాతం పెరిగింది. లింగ నిష్పత్తి కూడా మెరుగుపడింది. ప్రతి వెయ్యిమంది పురుషులకు 834 మంది మహిళా ఓటర్లున్నారు. మొత్తంగా ముసాయిదా జాబితాకు, తుది జాబితాకు 84, 28,767 మంది ఓటర్లు పెరిగారు. పెరిగిన వారిలో పురుషులు 42,27,902, మహిళలు 42,00,778 మహిళలు, 87 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు పెరిగారు.ఇక మొత్తంగా 18 -- 19 వయసు గల వారు 14,239,379 మందికి పెరగగా, లింగ నిష్పత్తి 824 నుంచి 834కి పది పాయింట్ల మేర పెరిగింది. ఓటర్లు ప్రత్యేకించి కొన్ని జిల్లాలో పెరిగారని ఎన్నికల అధికారి వెల్లడించారు. ప్రయాగ్‌రాజ్‌లో 3,29,421, లక్నో 2,85,961, బరేలీ 2,57,000, ఘజియాబాద్ 2,43,666, జౌన్‌పూర్‌లో 2,37,590 మంది ఓటర్లు పెరిగారు. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తికావడానికి ఎన్నికల అధికారులు, రాజకీయపార్టీలు, ఓటర్లను సమన్వయం చేసుకోవడం వల్లే ఇది సాధ్యమైందని సిఇఓ రిన్వా తెలిపారు.ఇక ఎస్ఐఆర్ ప్రక్రియలో 75 మంది జిల్లాల ఎలక్షన్ ఆఫీసర్లు (డిఇఓ), 403 ఇఆర్ఓ (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు), 12,758 అసిస్టెంట్ ఇఆర్ఓలు, 18,026 బిఎల్ఓ సూపర్‌వైజర్లు, 1,77,516 బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్ఓ), 5,82,877 మంది బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

# తెలంగాణలో మహిళలకు సిఎం శుభవార్త



హైద్రాబాద్: తెలంగాణలో మహిళలకు రేవంత్ రెడ్డి సర్కార్ తీపికబురు చెప్పింది. గతేడాది ఇందిరమ్మ చీరల పేరుతో ఈ పథకాన్ని ప్రారంభించగా.. ఈ ఏడాది కూడా ఉచిత చీరల పంపిణీ పథకాన్ని కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది మహిళలకు కొత్త రంగు, డిజైన్‌తో చిలకపచ్చ రంగు చీరలు తయారు చేయనున్నారు. గతేడాది పంపిణీ చేసిన చీరలు నీలం రంగు కాగా.. ఈసారి చిలకపచ్చ రంగును ఎంపిక చేసింది ప్రభుత్వం. ఈ మేరకు సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ ) కోటి చీరల తయారీ కోసం టెస్కోకి రూ.450 కోట్లు ఆర్డర్ కూడా ఇచ్చింది. ఈ చీరల్ని అక్టోబరు నాటికి సిద్ధం చేసి.. ఇందిరాగాంధీ జయంతికి నవంబరు 19న పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.గతేడాది తెలంగాణ ప్రభుత్వం 86 లక్షల మంది ఆడపడుచులకు చీరల్ని తయారు చేయించింది. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబరు 19న పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ప్రతి ఏటా ఒకటే రంగు చీర కాకుండా మార్పులు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. మంత్రి సీతక్క, సెర్ప్, మెప్మాల సీఈవో దివ్యాదేవరాజన్‌లు చీరలకు సంబంధించి కొన్ని నమూనాలను సిద్ధం చేయగా.. వీటిలో చిలకపచ్చ కలర్, ఎరుపు జరీ డిజైన్‌తో ఉన్న చీరను ముఖ్యమంత్రి రేవంత్ ఎంపిక చేశారు.ఈ మేరకు టెస్కోకు ఆర్డర్ ఇచ్చారు.. సిరిసిల్ల, వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాలలో నేత కార్మికులకు ఈ చీరల తయారీ బాధ్యతను అప్పగించనున్నారు. మొత్తం 11 ప్రాంతాల్లో ఈ పనులు అప్పగించాలని నిర్ణయించారు. గతేడాది పట్టణ, గ్రామీణ ప్రాంతాల మహిళలకు విడివిడిగా చీరల్ని పంపిణీ చేయగా.. ఈ ఏడాది గ్రామీణ, పట్టణ ప్రాంతాల వారికి ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించారు. మొత్తం మీద తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది కూడా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుంది. అయితే ఈ ఏడాది చీరల రంగు మారింది.. కొత్త డిజైన్‌తో తయారుకానున్నాయి.

# భర్త నల్లగా ఉన్నాడని ప్రియుడితో కలిసి మర్డర్ స్కెచ్..

మధ్యప్రదేశ్, కుటుంబ విలువలు, సంప్రదాయాలు పాటించే ఈ నేలపై కొంత మంది చేస్తున్న పనులు సమ సమాజాన్ని తలదించుకునేలా చేస్తున్నాయి. రూపం నచ్చలేదని కట్టుకున్న వాడిని కడతేర్చడం వినడానికే అసహ్యంగా ఉంది. రంగును చూసి మనిషిని వెక్కిరించడమే కాక, ప్రేమికుడి కోసం ఏకంగా ప్రాణాలు తీయడం చూస్తుంటే సమాజంలో మానవ సంబంధాలు ఎంతలా దిగజారుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఈ దారుణ ఘటనపై పలువురు దిగ్భ్రాంతికి గురవుతున్నారు.అందం అనేది చూసే కళ్లలో ఉండాలి కానీ, అది ఒక ప్రాణం తీసే స్థాయికి వెళ్తుందంటే ఆ మనసు ఎంత వికృత మైందో అర్థం చేసుకోవచ్చు. నల్లగా ఉన్నాడనే నెపంతో భర్తను నిరంతరం వేధించడమే కాక, తన 'అందం' తన ప్రియుడికి మాత్రమే సొంతం కావాలనే వెర్రి వ్యామోహంతో ఆ ఇల్లాలు చేసిన ఘాతుకం ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. దోపిడీ దొంగలు చంపారంటూ డ్రామా ఆడి పోలీసులనే తప్పుదోవ పట్టించాలనుకున్న ఆ కిలేడి ప్లాన్, కేవలం 36 గంటల్లోనే బట్టబయలైంది.ఏప్రిల్ 7వ తేదీ అర్ధరాత్రి ధార్ జిల్లాలోని గోండిఖేడా గ్రామంలో దేవకృష్ణ పురోహిత్ దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు వచ్చేసరికి ఇల్లంతా సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. భార్య ప్రియాంక కాళ్లు చేతులు కట్టేసి ఉండి, దొంగలు పడి నగలు, నగదు కోసం తన భర్తను చంపేశారని ఏడుస్తూ కథలు చెప్పింది. అయితే, ఇల్లంతా వెతికిన పోలీసులకు నగలు ఇంట్లోనే దొరకడంతో ప్రియాంక చెప్పిన మాటలపై అనుమానం మొదలైంది. దర్యాప్తులో దేవకృష్ణ సోదరి ఇచ్చిన వాంగ్మూలం పోలీసులకు అసలు విషయాన్ని చేరవేసింది. 'మా తమ్ముడు నల్లగా ఉన్నాడని ప్రియాంక ఎప్పుడూ అసహ్యించుకునేది. నీకంటే అందమైన వాడు నాకు దక్కాలి అంటూ గొడవ పడేది' అని పోలీసులకు చెప్పుకున్నారు. ఈ చిన్న క్లూతో పోలీసులు ప్రియాంక కాల్ డేటాను పరిశీలించగా, కమలేష్ అనే వ్యక్తితో ఆమెకు ఉన్న వివాహేతర సంబంధం వెలుగులోకి వచ్చింది. పెళ్లికి ముందే వారిద్దరూ ప్రేమించుకున్నారని, భర్తను వదిలించుకోవడానికి ఇద్దరూ కలిసి ప్లాన్ చేశారని తేలింది.ప్రియుడు కమలేష్ తన స్నేహితుడు సురేంద్రకు లక్ష సుపారీ ఇచ్చి ఈ హత్య చేయించాడు. ప్రియాంక కావాలనే ఇంటి తలుపులు తీసి ఉంచగా, నిద్రిస్తున్న దేవ కృష్ణను సురేంద్ర అతి కిరాతకంగా చంపేశాడు. ఆ తర్వాత తాము పట్టుబడకుండా ఉండేందుకు దోపిడీ దొంగల సీన్ క్రియేట్ చేశారు. ప్రియాంకను తాళ్లతో కట్టేసి, ఆమెను బాధితురాలిగా చూపే ప్రయత్నం చేశారు. కానీ, పోలీసుల ఇంటరాగేషన్‌లో ఆమె పొంతన లేని సమా ధా నాలు చెప్పి అడ్డంగా దొరికి పోయింది.ఎస్పీ మయాంక్ అవస్తి నేతృత్వంలో పోలీసులు వేగంగా దర్యాప్తు చేసి, కేవలం 36 గంటల్లోనే నిందితులను అరెస్ట్ చేశారు. తన ప్రియుడి కోసం కట్టుకున్న భర్తను చంపించినట్లు ప్రియాంక నేరాన్ని అంగీకరించింది. ప్రస్తుతం ప్రియాంక, కమలేష్ పోలీసుల కస్టడీలో ఉండగా, సురేంద్ర కోసం గాలిస్తున్నారు. రంగును చూసి వెక్కిరించిన ఆ 'అందగత్తె' ఇప్పుడు కటకటాల వెనుక తన అందాన్ని చూసుకునే స్థితికి చేరుకుంది.రూపాయికి ఆశపడే సుపారీ హంతకులు, ప్రియుడి వ్యామోహంలో పడి భర్తను చంపే భార్యలు.. ఈ ఘటన సమాజానికి ఒక పెద్ద హెచ్చరిక. రంగును చూసి మనిషి విలువను అంచనా వేయడం, ఆ నెపంతో నేరాలకు పాల్పడడం అత్యంత హేయమైన చర్య. అందమైన ముఖం వెనుక ఉన్న భయంకరమైన రాక్షసి రూపాన్ని పోలీసులు బట్టబయలు చేశారు.

# ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి సమ్మర్ కిట్ల పంపిణీ

సూర్యాపేట : సూర్యాపేట, కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ కె.నరసింహ చలువ కళ్లద్దాలు, సమ్మర్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండాకాలంలో ట్రాఫిక్ విధులను నిర్వర్తించే ట్రాఫిక్ సిబ్బంది ఎండ వేడిమి నుండి సరైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సిబ్బంది ప్రతి ఒక్కరి పనితీరు గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రోడ్లపై విధులు నిర్వర్తించేటప్పుడు తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునే విధంగా ఈ కిట్లను అందజేయడం జరిగిందన్నారు.విధుల పరంగానైనా, వ్యక్తిగతంగానైనా ఎలాంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఎండ వేడిమి నుండి ఎప్పటికప్పుడు తమను తాము సంరక్షించుకోవాలంటే ఎక్కువగా నీళ్లు త్రాగాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పై నిత్యం ప్రజలకు అవగాహన కల్పిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకై భాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరసింహచారి, సీఐలు వెంకటయ్య, శివశంకర్, రిజర్వ్ సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఎస్ఐలు సాయిరాం, అంజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# అమెరికన్లు ఆ భూమిని దొంగలించారా?

అమెరికా, అమెరికాలోని టెక్సాస్‌లో భారత సంతతి మహిళ అంకిత చేసిన సాహసోపేతమైన ప్రసంగం, ఆమె ఇచ్చిన గట్టి కౌంటర్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. జాత్యహంకార వ్యాఖ్యలకు ఆమె తన మాటలతో చెక్ పెట్టిన తీరు ప్రపంచాన్ని సైతం ఆకట్టుకుంది.ఆత్మగౌరవం దెబ్బతిన్నప్పుడు ఎదురుతిరగడం కంటే గొప్ప సమాధానం ఏముంటుంది. తమని తాము ఈ దేశ అసలైన వారసులమని భావిస్తూ, వలసదారులపై విద్వేషాన్ని కురిపిస్తున్న కొందరికి ఒక భారత సంతతి మహిళ గట్టి షాక్ ఇచ్చింది. టెక్సాస్‌లోని ఫ్రిస్కో సిటీ కౌన్సిల్ సమావేశం వేదికగా ఆమె చేసిన ప్రసంగం ఇప్పుడు జాత్యహంకార శక్తుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. 'ఇది దొంగిలించిన భూమి.. మీరు కూడా వలస వచ్చిన వారే' అంటూ ఆమె వినిపించిన గళం అమెరికాలో భారతీయుల పట్ల పెరుగుతున్న వ్యతిరేకతకు ఒక బలమైన నిరసనగా మారింది.సిటీ కౌన్సిల్ సమావేశంలోటెక్సాస్‌లోని ఫ్రిస్కో సిటీ కౌన్సిల్ సమావేశంలో ఇటీవల భారతీయ సంతతిని లక్ష్యంగా చేసుకొని కొన్ని జాత్యహంకార వ్యాఖ్యలు చోటుచేసుకున్నాయి. పదేపదే కొందరు వ్యక్తులు ఈ వేదికపైకి వచ్చి భారత వ్యతిరేక, వలస వ్యతిరేక ప్రసంగాలు చేస్తూ ఉండటాన్ని 'అంకిత' అనే భారతీయ యువతి సహించలేకపోయింది. తన ప్రసంగ సమయాన్ని ఉపయోగించుకొని, జాత్యహంకారాన్ని వ్యాప్తి చేస్తున్న వారిని నేరుగా నిలదీసింది. బహిరంగ సమావేశాల్లో ఇలాంటి విషం చిమ్మడం వల్ల సమాజంలో భయం, శత్రుత్వం పెరుగుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.చరిత్రను గుర్తుచేసిన అంకితతన ప్రసంగంలో అంకిత ఒక కీలకమైన అంశాన్ని ప్రస్తావించింది. వలసదారులను నిందిస్తున్న వారు తాము కూడా ఐరోపా నుంచి వలస వచ్చిన వారి వారసులమే అన్న నిజాన్ని మర్చిపోయారని ఆమె గుర్తు చేసింది. అమెరికా అనే దేశం ఇక్కడి స్థానిక ప్రజల నుంచి తీసుకున్న 'దొంగిలించబడిన భూమి'పై నిర్మించబడిందని ఆమె సూటిగా విమర్శించింది. దేశాభివృద్ధిలో వలసదారులు అందిస్తున్న సహకారాన్ని విస్మరించి, సామాజిక సమస్యలకు వారిని బలిపశువులను చేయడం తగదని ఆమె హెచ్చరించింది.దేవాలయాలు, మసీదులపై దాడులపై..ఫ్రిస్కోలోని దేవాలయాలు, మసీదుల వెలుపల హింసాత్మక గుంపులు ప్రదర్శనలు చేయడాన్ని అంకిత ఖండించింది. ఇలాంటి మతోన్మాద చర్యలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కౌన్సిల్‌ను డిమాండ్ చేసింది. బహిరంగ సమావేశాల్లో చేసే జాత్యహంకార వ్యాఖ్యలు శారీరకంగా హాని చేయకపోయినా, అవి మానసికంగా, భావోద్వేగపరంగా కమ్యూనిటీ సభ్యులను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆమె ఎత్తి చూపింది.భారతీయ పిల్లలే లక్ష్యం..?మరో స్పీకర్ ప్రణవి ఛత్రథి కూడా ఈ సమావేశంలో మాట్లాడారు.. ఆన్ లైన్ లో భారతీయ–అమెరికన్ పిల్లలను ఎలా లక్ష్యంగా చేసుకుంటున్నారో వివరించారు. మునుపటి సమావేశాల్లో పాల్గొన్న బాయ్ స్కౌట్స్ ను వారు భారతీయులు కాబట్టి ఎగతాళి చేయడం అత్యంత హేయమైన చర్య అని పేర్కొన్నారు. నగరాన్ని 'భారతదేశం స్వాధీనం చేసుకుంటోంది' అంటూ కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలను ఆమె తప్పుబట్టారు.టెక్సాస్‌లో పెరుగుతున్న భారత వ్యతిరేక సెంటిమెంట్‌కు అంకిత, ప్రణవి ఇచ్చిన సమాధానం ఇప్పుడు వలసదారులందరికీ ధైర్యాన్ని ఇస్తోంది. అగ్రరాజ్యం అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఎంత కీలకమో అందరికీ తెలిసిందే.., కానీ ఇప్పుడు మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి జాత్యహంకార దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. అంకిత అన్నట్లుగా, మౌనంగా ఉండడం కంటే ఎదురుదాడి చేయడమే ఇలాంటి శక్తులకు సరైన మందు.

# ఇబ్బందులు తొలగించాలి: ఎస్పీ



సూర్యాపేట : ఆపరేషన్ రోప్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి పాదాచారులకు, పౌరు లకు, వాహనదారులకు ఇబ్బందులు తొల గిం చాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసిం హ సిబ్బందికి సూచించారు. జిల్లా పోలీస్ కార్యాల యంలో జిల్లాలోని డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ పోలీ స్ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ యన మాట్లాడారు. జిల్లాలోని ముఖ్య పట్టణాల్లో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణ, పునరుద్ధరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణ కేంద్రాల్లో ట్రాఫిక్ సమస్యను అధిగమించాలని, రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారస్తులను సర్దుబాటు చేయాలని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఆధునీకరించాలని, వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సూర్యాపేట, కోదాడ పట్టణ ఇన్‌స్పెక్టర్లు వెంకటయ్య, శివశంకర్, ట్రాఫిక్ ఎస్ఐలు సాయిరాం, అంజిరెడ్డి పాల్గొన్నారు.

# పునరావాస ప్యాకేజీ అందిస్తున్నాం

హైదరాబాద్: తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట 42 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ... లొంగిపోయిన మావోస్టులకు రూ. 1.93 కోట్లు అందజేస్తున్నామని స్పష్టం చేశారు. లొంగిపోయిన మావోయిస్టులకు సీఎం ఆదేశాల మేరకు ఆరోగ్య కార్డులు అందజేస్తామని చెప్పారు. గత ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టలు లొంగిపోయారని తెలిపారు. తెలంగాణకు చెందిన వాళ్లు సెంట్రల్ కమిటీలో 11 మంది ఉండేవారు.. ఇప్పుడు ఇద్దరు ఉ న్నారు. స్టేట్ కమిటీలో తెలంగాణ వాళ్లు 24 మంది ఉండేవారు.. ఇప్పుడు ఇద్దరే ఉన్నారని చెప్పారు. మొత్తంగా తెలంగాణకు చెందిన వాళు దళంలో ఇంకా ఐదుగురు మిగిలారని వివరించారు. తెలంగాణకు చెందిన మిగిలిన ఐదుగురు కూడా లొంగిపోవాలని డీజీపీ శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో ఒకరు మాత్రమే తెలంగాణ వాసి అని, ఎక్కువ మంది ఛత్తీస్ గఢ్ వాసులే ఉ న్నారని సూచించారు. లొంగిపోయిన వారికి పునరావాస ప్యాకేజీ అందిస్తున్నామని వెల్లడించారు. తిరుగుబాటు నిరోధక చర్యల చరిత్రలో ఇది ఒక కీలక మైలురాయిగా నిలిచింది. ప్రధాన స్రవంతిలో కలిసిన వారిలో పీఎల్జీఏ బెటాలియన్ కమాండర్, ఐఖ్గాజ సభ్యుడైన సోడి మల్లా అలియాస్ కేశల్ అలియాస్ నిఖిల్, రాష్ట్ర కమిటీ సభ్యుడు, జీవీవీబో ఐఎజ కార్యదర్శి అయిన చాప నారాయణ అలియాస్ గజేందర్ అలియాస్ మధు, అలాగే దీఖ-ూూ= విభాగం ఐఎజ సభ్యుడైన కద్తి సన్ను అలియాస్ మంతు వంటి కీలక నాయకులు ఉన్నారని వివరించారు. లొంగిపోయిన కార్యకర్తలు 36 తుపాకులతో కూడిన భారీ ఆయుధాల నిల్వను వీటిలో47 రైఫిల్స్, రైఫిల్స్, 303 రైఫిల్స్, ఒక 9ఎఎ స్టెన్ గన్, పిస్టల్స్, రివాల్వర్లు, ఇతర ఆయుధాలు, 1,007 రౌండ్ల సజీవ మందుగుండు సామగ్రి, అదనంగా, 800 గ్రాముల బంగారాన్ని కూడా మావోయిస్టులు అప్పగించారు. వారి లొంగుబాటును ప్రకటిస్తూ, సీనియర్ మావోయిస్టు నాయకులు, 130 మంది కార్యకర్తలు 124 తుపాకులను అప్పగించి గతంలో లొంగిపోయిన ఘటనల పరంపరలోనే ఈ తాజా పరిణామం చోటుచేసుకుందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఈ వరుస లొంగుబాట్ల ఫలితంగా, సాయుధ విభాగమైన 'పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ' సమర్థవంతంగా నిర్వీర్యమైందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీకి చెందిన సభ్యులందరూ లొంగిపోవడంతో, రాష్ట్రంలోని మావోయిస్టు నెట్‌వర్క్ పూర్తిగా ఛిన్నాభిన్నమైందని అధికారులు వివరించారు.

# అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు

భువనగిరి : మండలంలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీస్కుంటామని మండల అధికారులు హెచ్చరించారు. స్థానిక అధికారులు ఎస్సై సైదా రావుఫ్, తహసీల్దార్ ఖాసీం, అటవీ శాఖ సిబ్బంది సంయుక్తంగా అక్రమ ఇసుక రవాణా మరియు త్రవ్వకాలను అరికట్టుటకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సాయనపల్లి గ్రామ సమీపంలోని కిన్నెరసాని వాగు వంతెన వద్ద జేసీబీ తో రెండు గుంతలు త్రవ్వించి అక్రమ ఇసుక రవాణాకు ఉ పయోగించే మార్గాన్ని మూసివేసి ఆ దారికి అడ్డుకట్ట వేశారు.

# మంత్రి పొంగులేటిని కలిసిన హాఫీజుద్దీన్

ఖమ్మం, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మొహమ్మద్ హాఫీజుద్దీన్ కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివా సరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. కూసుమంచి మండలం పర్యటనలో భాగంగా కూసుమంచి క్యాంప్ కార్యాలయంకు వచ్చిన మంత్రి పొంగులేటి ని హాఫీజుద్దీన్ కలిసి మాట్లాడారు. జిల్లా ప్రధానకార్యదర్శి గా బాధ్యతలు ఇచ్చిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహణ అప్పాయిగూడెం జీపీలో 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా పోషణ పక్షం కార్యక్రమంను అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్పంచ్ దండు ప్రవీణ్ చిన్నారుల ఆరోగ్యం, విద్య, మరియు పోషణపై అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలను మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉంచాల్సిన అవసరాన్ని వివరిం చారు. అలాగే చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిం చడం ద్వారా విద్యా ప్రాధాన్యతను తెలియ జేశారు. పిల్లల సరైన పోషణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ, ఆరోగ్యకరమైన ఆహారం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎట్టి సంధ్య రాణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ జి. రాధమ్మ, అంగన్వాడీ టీచర్ బత్తుల రోజామణి పాల్గొన్నారు. అదేవిధంగా పిల్లల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అన్ని విభాగాల్లోనూ పనిచేసేలా త్రివిధ దళాలు



న్యూఢిల్లీ:సమీకృతంగా పనిచేసేలా, సత్వరం స్పందించేలా, సాంకేతిక సాధనాలతో పోరాడగలిగేలా భారత త్రివిధ దళాలను త్వరితగతిన తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్), జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. అన్ని సైనిక విభాగాల్లోనూ సమర్థంగా పనిచేసే సామర్థ్యాన్ని త్రివిధ దళాలు కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఆధునిక యుద్ధం అనేది సంప్రదాయ సరిహద్దులు, కాలపరిమితులను వేగంగా అధిగమిస్తోందని సీడీఎస్ చెప్పారు. బెంగళూరులో జరిగిన 'రణ్ సంవాద్' సెమినార్ ముగింపు కార్యక్రమంలో అనిల్ చౌహాన్ ప్రసంగించారు. మల్టీ డొమైన్ ఆపరేషన్స్ (వీఙా) అనేవి ఇకపై కేవలం ఒక భావనాత్మక పదం కాదని, అవి ప్రస్తుత కాలపు కార్యాచరణపరమైన వాస్తవికత అని ఆయన అభిప్రాయపడ్డారు. డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పురోగతి, సైనిక సంఘర్షణల స్వరూపంలో వస్తున్న మార్పులు మల్టీ డొమైన్ ఆపరేషన్స్‌కు ఊతమిచ్చే అంశాలుగా మారాయన్నారు. ఈ ఏడాది 'రణ్ సంవాద్' థీమ్‌గా మల్టీ డొమైన్ ఆపరేషన్స్‌నే ఎంచుకున్న విషయాన్ని అనిల్ చౌహాన్ గుర్తుచేశారు. అదొక ఆకర్షణీయమైన పదం కావడం వల్ల థీమ్‌గా ఎంచుకోలేదని, యుద్ధ క్షేత్రంలోని కొత్త వాస్తవికతగా మల్టీ డొమైన్ ఆపరేషన్స్‌ను పరిగణిస్తున్నందు వల్లే థీమ్‌గా ఎంపిక చేశామన్నారు. ఈసారి మధ్య స్థాయి, జూనియర్ అధికారులకే ఛాన్స్"సాధారణంగానైతే ఇలాంటి సెమినార్‌లలో మాజీ సైనికులు, రక్షణ రంగ నిపుణులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటారు. కానీ నేను ఈసారి రణ్ సంవాద్ సెమినార్‌లో ఆ ట్రెండ్‌ను మార్చాను. ప్రస్తుతం త్రివిధ దళాల సేవల్లో చురుగ్గా నిమగ్నమై ఉ న్నవారికి యుద్ధ క్షేత్రంలో వస్తున్న తాజా మార్పులపై మంచి అవగాహన ఉంటుంది. అందుకే ఈసారి సెమినార్ వేదికగా భవిష్యత్ యుద్ధ క్షేత్రంపై ఆలోచనలను వ్యక్తీకరించే అవకాశాన్ని మధ్య స్థాయి, జూనియర్ అధికారులకు కల్పించాం. వారినే ఈసారి వ్యూహాత్మక చర్చలకు కేంద్ర బిందువుగా మార్చాం" అని సీడీఎస్ అనిల్ చౌహాన్ తెలిపారు. అధునాతన టెక్నాలజీలతో అత్యుత్తమ ఫలితాలు"రణ్ సంవాద్ సెమినార్‌లో గూఢచర్యం, నిఘా, పరిశీలనలపైనా సుదీర్ఘంగా చర్చించాం. కేవలం శత్రుదేశపు సైనికపరమైన సమాచారాన్ని సేకరించడంతో పని అయిపోదు. దాన్ని వేగంగా, నాణ్యంగా, కచ్చితత్వంతో విశ్లేషించి అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఈక్రమంలో సైనికపరమైన నిర్ణయాల స్వరూపాన్ని మార్చే సత్తా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా అనలిటిక్స్ వంటి అధునాతన టెక్నాలజీలకు ఉంది. త్రివిధ దళాలు వీటిని సరిగ్గా వాడుకుంటే, సైనికపరమైన కార్యాచరణ ప్రణాళికలు అత్యుత్తమ రీతిలో అమలవుతాయి. 1970వ దశకంలో అమెరికా సైనిక వ్యూహకర్త జాన్ బోయ్డ్ సైనికపరమైన నిర్ణయాలను తీసుకునేందుకు అబ్జర్వ్ – ఓరియంట్ – డిసైడ్ – యాక్ట్ (ఞాఙూ) పేరుతో నాలుగు దశల విధానాన్ని ప్రతిపాదించారు. యుద్ధం జరిగే వేళ ఓఓడీఏ విధానంలోని ఒక వలయాన్ని వేగంగా పూర్తిచేసే వారే గెలుస్తారు. ప్రత్యర్థిపై పైచేయిని సాధిస్తారు. ఇప్పుడు ఏఐ టెక్నాలజీ ప్రతీదాన్ని ముందుగానే అంచనా వేసి చెప్పగలుగుతోంది, విశ్లేషిస్తోంది. దీని సహకారంతో శత్రుదేశం కదలికలను పరిశీలన (అబ్జర్వ్) చేయడానికి ముందే, మనం స్వీయ సన్నద్ధత చేసుకోవడం వీలుపడుతుంది" అని సీడీఎస్ అనిల్ చౌహాన్ చెప్పారు. యుద్ధాన్ని రాజకీయ స్థాయిల్లోనూ చూడాలి"ప్రస్తుతం యుద్ధ స్వరూపంలో చాలా మార్పులు వస్తున్నాయి. సైనిక సంఘర్షణ ఇకపై కేవలం భౌతిక క్షేత్రానికే పరిమితం కాదు. ఇంతకుముందు వరకు జరిగిన యుద్ధాలన్నీ భౌతిక క్షేత్రాల పరిధిలోనే సాగాయి. ఇప్పుడు యుద్ధం ఒక కొత్త రకమైన వాస్తవికతలోకి అంటే శాస్త్ర సాంకేతిక స్వభావం కలిగిన స్థితిలోకి మారుతోంది. దీన్ని అర్థం చేసుకోవడం కొంత కష్టతరమైన అంశమే. యుద్ధాన్ని రాజకీయ స్థాయిల్లోనూ చూడాల్సి ఉంటుంది. ఎందుకంటే యుద్ధం నిర్ణయాలు, ఫలితాలు, పర్యవసానాలు అక్కడే డిసైడ్ అవుతాయి. ఒకవేళ కాల్పులు జరపకుండానే రాజకీయ లక్ష్యాలను సాధించగలిగితే, అప్పుడది కచ్చితంగా ఒక విభిన్నమైన అంశం అవుతుంది" అని సీడీఎస్ అనిల్ చౌహాన్ విశ్లేషించారు.

# ఆత్మగౌరవానికి అండగా నిలుస్తాం- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి



గట్టుప్పల్,: చేనేత కార్మికుల ఆత్మ గౌరవానికి అండగా నిలిచి వారి సమ స్యలు పరిష్కారం అయ్యేం తవరకు వెంటనే ఉంటానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి అన్నారు. గట్టు ప్పల్ మండల కేంద్రంలో చేనేత కార్మికు లకు రుణమాఫీ చెక్కుల పం పి ణీ చేసి మాట్లా డారు. నేతన్నల బీమా పథకం కింద 7 మం దికి రూ. 35 లక్షల విలువైన చెక్కులు అంద జేయగా, చేనేత రుణమాఫీ పథకం కింద 141 మంది నేతన్నల కు రూ. 1 కోటి 10 లక్షల 75 వేల రూపా యల చెక్కు లను పంపిణీ చేశారు. చిన్ననాటి నుంచే చేనేత కార్మికుల కష్టాలు తెలుసునని, తమ గ్రామంలో చేనేత కుటుం బాల తో కలిసి జీవించామని తెలి పారు. టెక్నాలజీ పెరుగుదలతో మరమగ్గాలు రావడంతో నేతన్నల పరిస్థితి మరింత దిగజారిందని అన్నారు. నాగరిక ప్రపంచంలో ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది నేతన్నలేనని, కానీ బట్టలు నేస్తున్న వారి జీవితం మాత్రం కష్టాల్లోనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నేతన్నల సమస్యలపై ప్రత్యేకంగా అధ్యయనం చేసి నివేదిక తయారు చేసి వారితో కలిసి ముఖ్యమంత్రిని కలుస్తానని హామీ ఇచ్చారు. పేదరికంలో ఉన్న చేనేత కార్మికులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ప్రజా ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకుంటుందని, సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తాను వారి వెంట ఉంటానని స్పష్టం చేశారు. గట్టుప్పల్ మండల ఏర్పాటు తన రాజీనామా ఫలితమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# 14న ఓరుగల్లు పోరుగర్జన

వరంగల్: బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు తమ్మడి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏప్రిల్ 14న వరంగల్లో కేడీసి కాలేజ్ గ్రౌండ్ లో జరగే బహుజన ఓరుగల్లు పోరుగర్జన సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు నీర్మాల రత్నం, జిల్లా అధ్యక్షులు మడిపడిగ చంద్రశేఖర్ హాజరై మాట్లాడుతూ బహుజనులపై జరుగుతున్న అన్యాయాలు, దోపిడీ, రాజకీయ మోసాలకు ఇక చెక్ పెట్టే సమయం వచ్చిందని స్పష్టం చేశారు. ఇక మౌనం కాదని పోరాటమే మార్గం అంటూ బహుజన సమాజాన్ని ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బిఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ బహుజన రాజ్యాధికారాన్ని సాధించే దిశగా ఈ సభ ఒక చారిత్రాత్మక గర్జనగా నిలుస్తుందన్నారు. ప్రస్తుత, గత ప్రభుత్వాలు బహుజనుల ఆశయాలను మోసం చేశాయని, వారి హక్కులను కాలరాసాయని తీవ్రంగా విమర్శించారు. ఇకపై బహుజనులు చూసే ప్రేక్షకులు కాదు, చరిత్రను రాసే నాయకులమని స్పష్టం చేశారు. ఈ సభ బహుజనుల ఆత్మగౌరవానికి నాంది పలికే పోరుగర్జనగా మారాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు మండల ప్రధాన కార్యదర్శి గొల్ల ఆనంద్, గందమాల చందు, కర్రె అశోక్, గోల్లూరి ప్రదీప్ పాల్గొన్నారు.

# సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ధ్యేయం



గుడిపల్లి,: రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ప్రధాన ధ్యేయం. అని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. గుడిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామా లలో మౌలిక సదుపాయల కల్ప నపై మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేనవత్ బాలు నాయక్ మాట్లా డుతూ... తాగునీటిని వృధా చేయ కుండా, జాగ్రత్తగా నీటిని వినియో గించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిం చారు. రానున్న రెండు నెలలు అత్యంత కీలకమైనందున అప్పటి వరకు ఎక్కడా నీటి కొరత రాకుండా చూడాలని ఆదేశించారు. రేషన్ కార్డు కలిగిన ఇంటి యాజమాని ప్రమా దశాత్తుతో మరణిస్తే వారి కుటుంబానికి ఆదుకోవడానికి జూన్ 2వ తేదీ నాటి నుండి 5లక్షల రూపాయల ప్రమాద భీమా పథకం ప్రారంభం అవుతుందని అన్నారు. దళారుల బారిన పడకుండా, రైతులు మద్దతు ధర పొందేలా ఈ కేంద్రాలను వినియోగించుకోవాలని వారు సూచించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో పడతాయని, సన్న వడ్లకు క్విం టాలుకు రూ. 500 బోనస్ ఇస్తు న్నామని, క్వింటాలుకు రూ. 2,389 మద్దతు ధరతో కొనుగోలు చేస్తు న్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అండాలు, తహసీల్దార్ ధీవేనమధువాసిని , మండల స్థాయి అధికారులు, మండల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మండిపోతున్నా ఎండలు

నల్లగొండ: రాష్ట్రంలో ఎండలు మండి పోతున్నాయి.. ఉష్ణోగ్రత 35 డిగ్రీలను దాటి 40 డిగ్రీల వైపు శరవేగంగా పరిగెడుతోంది. ఏప్రిల్ మొదటి వారంలోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే.. మేలో ఎలా ఉంటుందోనని జనాలు ఆందోళన చెందుతున్నారు. పల్లెలు, పట్టణాలు, నగరాలనే తేడా లేకుండా నీటి ఎద్దడి తీవ్రతరమవుతోంది. కొండ ప్రాంతాలు, ఆదివాసీ, గిరిజన గూడేల్లో ఇది మరింత ఎక్కువగా ఉంది. అధికారిక సమాచారం ప్రకారమే మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్, వికారాబాద్ జిల్లాల్లో ఇప్పటికే తాగునీటికి కటకట ఏర్పడింది. ఈ జిల్లాల్లోని 19 నియోజకవర్గాలు, 3,200 గ్రామాల్లో నీటి కొరత ఏర్పడే ప్రమాదముందని అంచనా. దీన్ని అధిగమించేందుకు అన్ని రకాల ప్రణాళికలు రచించామని ప్రభుత్వం చెబుతోంది. గత రెండేండ్ల నుంచి వీటిని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని ఉన్నతాధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ, పరిస్థితి మాత్రం ఆశాజనకంగా లేకపోవటం గమనార్హం. గతేడాది కృష్ణా బేసిన్‌లో అనుకున్నంత స్థాయిలో వర్షాలు పడలేదన్నది గణాంకాల సారాంశం. ఆ ప్రభావం ఈ వేసవిలో ఉండబోతున్నది వాతావరణ శాఖ వర్గాల భోగట్టా. ఈ క్రమంలో పలు రిజర్వాయర్లలో నీటి మట్టం అనుకున్నంత స్థాయిలో లేదు. మరోవైపు ఎండల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీటిలో పొదుపు తప్పదనే సంకేతాలు బలంగా వినబడుతున్నాయి. అలాంటప్పుడు ఫ్లోరైడ్ ప్రభావిత ఉమ్మడి పాలమూరు, ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లోని ప్రజలు మినరల్ వాటర్ మీద ఆధారపడా ల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఇప్పటికే 20 లీటర్ల క్యాన్‌కు రూ. 10 నుంచి రూ. 20 వసూలు చేసున్న నీటి వ్యాపారులు.. రాబోయే రెండు నెల్లపాటు 'డిమాండ్-సప్లయ్' సూత్రాన్ని విధిగా పాటించాలని నిర్ణయించారు. అప్పుడు గుక్కెడు నీటి కోసం జనాలు పడరాని పాట్లు పడాల్సి రావటం ఖాయం. జీడీపీలు, జీఎస్‌డీపీలు, వృద్ధి రేటు గురించి మన పాలకులు, ప్రభుత్వాధినేతలు గొంతు చించుకుని ఎంత గొప్పలు చెప్పుకున్నా.. చుక్క నీటికోసం దళితులు, ఆదివాసీలు మైళ్ల కొద్దీ నడవాల్సి రావటం వారి విధానాల్లోని డొల్లతనాన్ని తెలియజేస్తోంది. ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో ఈ దృశ్యాలు మనకు ఎక్కువగా కనబడుతుంటాయి. బిందెలు నెత్తిన పెట్టుకుని మహిళలు మండుటెండలో నడుస్తున్న ఫొటోలు అనునిత్యం పత్రికల్లో ప్రత్యక్ష మవుతుంటాయి. ఎందుకంటే హైదరాబాద్‌లోలాగా ఆయా ప్రాంతాల్లో ఏ కంపెనీగానీ, ఏ వ్యక్తీగానీ 'చలివేం ద్రాలు' ఏర్పాటు చేయరు కాబట్టి. రెక్కాడితేగాని డొక్కాడని వ్యవసాయ కార్మికులు, ఇతర పేదలకు అన్ని కాలాల్లో, ముఖ్యంగా పనులు దొరకని వేసవిలో ఇప్పటిదాకా ఇంత బువ్వ పెట్టింది 'ఉపాధి హామీ' చట్టం. కానీ దాని పేరును మార్చి..ఆ చట్టం ఉద్దేశాన్ని ఏమార్చి... అన్నింటికీ 'రామ్.. రామ్...' చెప్పేసింది మోడీ ప్రభుత్వం. నిధుల్లో కోత పెట్టి, పని దినాలను కట్ చేసి, వారి కడుపు మీద కొట్టింది. అలాంటప్పుడు తమది ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న వారు కేంద్రంతో కొట్లాడైనా సరే.. ఇలాంటి పేదలందర్నీ విధిగా ఆదుకోవాలి. అందరికీ పని కల్పించటంతోపాటు పని ప్రదేశాలు, గృహాలకు కూడా సురక్షితమైన తాగునీటిని అందించాలి. ఇక రాజధాని హైదరాబాద్‌తోపాటు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో 'వాటర్ మాఫియా' గురించి చెప్పాల్సిన పనిలేదు. ఈ దందా ద్వారా ఈ రెండు మూడు నెలల్లో ఏడాదికి సరిపడా సంపాదించు కుంటారనేది బహిరంగ రహస్యం. విల్లాలు, అపార్టుమెంట్లు, కాలనీలు, బస్తీల్లోని ప్రజల నీటి అవసరా లను ఆసరాగా చేసుకుని ఇబ్బడిముబ్బడిగా దండుకుంటారు వాటర్ ట్యాంకర్ల యాజ మాన్యాలు. ఆ సమయాల్లో వాటర్ వర్క్స్, జలమండలి అధికారుల ఫోన్లు 'ఎందుకోగాని' మూగబోవటం పరిపాటి. ఈ దుస్థితిని నుంచి ప్రజలను బయటపడేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలి. తెలంగాణ వ్యాప్తంగా రాజధాని నుంచి పంచాయతీ వరకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ప్రజలకు మంచి నీటిని అందించటమనేది తమ కనీస బాధ్యతగా ప్రభుత్వాధినేతలు గుర్తించాలి. వాటర్ మాఫియా దోపిడీని అరికట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను రంగంలోకి దించాలి. ఎక్కడెక్కడ నీటి ఎద్దడి ఉందో.. అక్కడక్కడ నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించి, అమలు చేయించాలి. జిల్లా కలెక్టర్లు, పంచాయతీరాజ్ అధికారులు, మున్సిపల్ ఆఫీసర్లకు ఆ మేరకు తగినన్ని నిధులు కేటాయించాలి.

# సిఎం సహాయ నిధి పేదలకు వరం

సూర్యాపేట, పేదలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ వరమని మఠంపల్లి మండలంలోని పెదవీడు గ్రామ సర్పంచ్ అమరారపు వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా ఆయన వివిధ అనారోగ్య కారణాల వలన చికిత్స పొందిన ఏడుగురు లబ్ధిదారులకు రూ. 3.39 లక్షలు విలువ చేసే చెక్కులను హుజూర్ నగర్ లోని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో అంద జేశారు. ప్రమాదాలతో పాటు అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా వారిని మంత్రి ఉత్తమ్ సహకారంతో ఆదుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డ్ సభ్యులు టి. శ్రీనివాస్,నాగేంద్ర, లబ్ధిదారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TElTEL 2010/34557, Cell: 9849758280